నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

మంచి,చెడులు రెండు మహిననుండు నెపుడు
నరులనెంచునంట నడత బట్టి
జనులుమెలగు నటులె జనులభవిత యుండు
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

-------------------------


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 166 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 21-9-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


# నేటినుంచి బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ పల్లెల్లో సందడేసందడి
- రేపటి నుంచి దసరా శరన్నవరాత్రులు



నిజామాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మానవుడి జీవితంతో ముడిపడి ఉన్న ప్రతి వస్తువును ఆరాధనగా చూసి ప్రేమించి పూజించడం మన వారసత్వానికి నిదర్శనం. అందుకే ఆకాశం,నీరు,గాలి, నిప్పు, భూమిలనుపంచభూతాలుగా పూజిస్తున్నాం. మనజీవన విధానం అంతా కూడా ప్రకృతితో మమేకమై ఉంది. ప్రకృతి ఆరాధన అన్నది భారతీయ సంస్కృతితో పెనవేసుకుని ఉంది. పుట్టలను,చెట్లను, పూలను పూజించే గొప్పతనం మనది. దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండగలు ఈ కోవలోకే వస్తాయి. ప్రకృతిని పూజించే మహత్తరమైన వేదికలు ఇవి. ఆదివారం నుంచి బతుకమ్మ -మిగతా 2 లో



# మోడీకి ట్రంప్ రిటర్న్ గిఫ్ట్

- వీసా ధరలు విపరీతంగా పెంపు
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎద్దేవా

న్యూఢిల్లీ,
హెచ్ -1 బి వీసా దరఖాస్తుల వార్షిక రుసుము లక్ష డాలర్లకు విధించాలనే అమెరికా నిర్ణయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఇది మోడీ ఇటీవల జరుపుకున్న పుట్టినరోజు సందర్భంగా ట్రంప్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ అని ఖర్గే అభివర్ణించారు. 'మీరందుకున్న రిటర్న్ గిఫ్ట్‌లతో భారతీయులు బాధపడుతున్నారు. మీ అబ్కి బార్ ట్రంప్ సర్కార్ ప్రభుత్వం నుండి ట్రంప్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్. హెచ్ 1- బి వీసా లక్ష డాలర్ల పెంపు వల్ల భారతీయ టెక్ కార్మికులను తీవ్రంగా దెబ్బతీసింది. అమెరికాలో -మిగతా 2 లో



# నేడు సూర్యగ్రహణం

భారత్‌లో కనిపించని ప్రభావం

హైదరాబాద్,
సూర్యగ్రహణాలు ఎల్లప్పుడూ అమావాస్య రోజులలోనే సంభవిస్తాయి, కానీ ఈసారి అది సర్వ పితృ అమావాస్య నాడు సంభవిస్తుంది. జ్యోతిషశాస్త్రం ప్రకారం, సూర్యగ్రహణానికి 12 గంటల ముందు సూతక కాలం ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరం రెండవ మరియు చివరి సూర్యగ్రహణం సెప్టెంబర్ 21 ఆదివారం నాడు సంభవిస్తుంది. ఇది పాక్షిక సూర్యగ్రహణం, గ్రహణానికి కొద్దిసేపటి ముందు సూతక కాలం ప్రారంభమవుతుంది. సూతక కాలంలో ఎటువంటి -మిగతా 2 లో

# విదేశాలపై ఆధారపడడమే పెద్ద తప్పు

అదే మనకు అతిపెద్ద శత్రువు

- విదేశాలపై ఎంతగా ఆధారపడితే అంతగా విఫలం అవుతాం
- ట్రంప్ వీసా ఛార్జీలపై ప్రధాని మోడీ పరోక్ష హెచ్చరిక



గాంధీనగర్ సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): : హెచ్ 1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు లక్ష డాలర్ల దరఖాస్తు రుసుము విధించటంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ మేరకు శనివారం ట్రంప్ నిర్ణయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశాలపై ఆధారపడటమే అన్నింటికన్నా పెద్ద శత్రువని మోదీ పేర్కొన్నారు. విదేశాలపై ఆధారపడొద్దని తాను ఎప్పటినుంచో చెబుతున్నానన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'మనమంతా కలిసి ఆ శత్రువును జయించాల్సిన అవసరం ఉంది. విదేశాలపై మనం ఎంతగా ఆధారపడితే మన దేశం అంతలా విఫలం అవుతుంది. మనమంతా కలిసి భారత్‌ను ప్రపంచంలోనే బలమైన -మిగతా 2 లో



# రేవంత్‌కు కిషన్ రెడ్డి ఫోబియా పట్టుకుంది

- ఓట్ల చోరీకి..బోగస్ ఓట్లకు తేడా తెలియదు
- శ్యామ్ పిట్రోడా డైరెక్షన్ వల్లే ఈ సమస్య
- రాహుల్ తీరుపై మండిపడ్డ రామచంద్రరావు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి ఫోబియా పట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా ప్రతి విషయంలో కేంద్రపై నెపం వేస్తోందన్నారు. అధికారుల కొరతతో పాలనలో శూన్యత నెలకొంది. గ్రూప్ వన్ సమస్యతో సెలెక్ట్ అయినవారూ, కాలేని వారూ బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్ర రాజకీయాలు, -మిగతా 2 లో

# ఉగ్రవాద కుట్ర భగ్నం

- జమ్ముకశ్మీర్‌లో చైనా గ్రెనేడ్ల స్వాధీనం..



శ్రీనగర్:
జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. చైనా గ్రెనేడ్లతోపాటు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పూంచ్ సెక్టార్‌లోని ఒక చోట ఆయుధాలున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. 20 చైనా హ్యాండ్ గ్రెనేడ్‌లతో సహా పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాద కార్యకలాపాల కోసం తరలించేందుకు వాటిని అక్కడ దాచినట్లు భద్రతా సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. సకాలంలో వీటిని గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో ఉగ్రవాద కుట్రను భగ్నం చేసినట్లు అధికారులు తెలిపారు.కాగా, కశ్మీర్‌లోని ఏడు జిల్లాలైన శ్రీనగర్, బారాముల్లా, అనంత్‌నాగ్, కుప్వారా, హంద్వారా, -మిగతా 2 లో



# దేశానికి బలహీనమైన ప్రధాని ఉన్నడు

- హెచ్1బీ వీసాల జారీకి లక్ష అమెరికన్ డాలర్ల ఫీజు
- ట్రంప్ నిర్ణయంతో కోట్ల మంది భారత యువతకు నష్టం
- దీనిపై కూడా ప్రధాని మోదీ మౌనంగా ఉంటున్నారు
- రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత

న్యూఢిల్లీ,
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత , లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ .. ప్రధాని నరేంద్ర మోదీ పై మరోసారి విమర్శలు గుప్పించారు. దేశం ఒక బలహీనమైన ప్రధానిని కలిగి ఉన్నదని విమర్శించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు.'ఐ రిపీట్, ఇండియా హాజ్ ఎ వీక్ పీఎం' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. 2017లో కూడా హెచ్1బీ వీసా అంశాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు ప్రధాని ప్రస్తావించకపోవడాన్ని రాహుల్ తప్పుపట్టారు. 'ఇండియా హాజ్ ఎ వీక్ పీఎం' అని అప్పట్లో పోస్టు పెట్టారు. తాజాగా హెచ్1బీ వీసాలకు ఒక లక్ష డాలర్ల (సుమారుగా రూ.88.80 లక్షలు) ఫీజు -మిగతా 2 లో

# కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

అందుకోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నాం

- ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంతో భరోసా
- వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లే దుస్థితి లేదు
- మహిళాశక్తి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మహిళలను కోటీశ్వరులను చేసేవిధంగా ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నాయని తెలంగాణ డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క తెలిపారు. మహిళలు కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. హైదరాబాద్ లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భట్టి విక్రమార్క హాజరయ్యారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలోమంత్రులు సీతక్క, వివేక్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడం తమ లక్ష్యమని, మహిళలను -మిగతా 2 లో



# చీఫ్ జస్టిస్‌తో సీఎం రేవంత్ భేటీ

- కోర్టు భవనాలు, మౌళిక వసతులపై చర్చ



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఎసిఆర్ హెచ్‌ఆర్‌డిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి శేషాద్రి, లా సెక్రటరీ పాపి రెడ్డి, జస్టిస్ పి. సామ్ కోశి, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, ఇతర ఉన్నతాధికారులు. రాష్ట్రంలో న్యాయవ్యవస్థకు -మిగతా 2 లో

# కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదు

- కొత్త పార్టీపైనా ఇప్పుడే నిర్ణయం తీసుకోలే
- ఇరిగేషన్‌పై గతంలోనే కేటీఆర్‌ను హెచ్చరించా
- ఆల్మట్టిపై సీఎం పెదవి విప్పాల్సిందే
- రాజకీయాల్లో తొక్కుకుంటూ ముందుకు పోవాల్సిందే
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుప్రీం కోర్టు స్టే ఉన్నప్పటికీ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచేందుకు కర్ణాటక సిద్ధమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. ఆల్మట్టిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ..ప్రభుత్వం వెళ్లకుంటే జాగృతి తరపున సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని, మహారాష్ట్ర ఇప్పటికే స్పందించి కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిందని తెలియజేశారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే -మిగతా 2 లో

# మోడీకి ట్రంప్ రిటర్న్ గిఫ్ట్

(మొదటి తరువాయి)

హెచ్ -1బి వీసా హోల్డర్లలో 70 శాతం మంది భారతీయులే' అని ఖర్గే శనివారం తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. భారత జాతీయ ప్రయోజనాలే అత్యున్నతమైనవి. బేర్ హగ్స్, హలో నినాదాలు, మోడీ.. మోడీ అని జపించేలా చేయడం విదేశాంగ విధానం కాదు. విదేశాంగ విధానం అంటే.. మన జాతీయ ప్రయోజనాలను కాపాడడం. భారతదేశాన్ని మొదటి స్థానంలో ఉంచడం. జ్ఞానం, సమతుల్యతతో స్నేహాలను నడిపించడం. దీనిని మన దీర్ఘకాలిక స్థితిని దెబ్బతీసే ప్రమాదం ఉన్న ఉపరితల ధైర్యసాహసాలకు తగ్గించలేము' అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పెహల్గామ్ దాడి సందర్భంగా భారత్ తలపెట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో.. భారత్ – పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లు- ట్రంప్ పదేపదే చెబుతున్నారు. భారత్ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో దాదాపు పది రంగాల్లో భారత్ 2.17 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయినట్లు- అంచనా వేయబడిందని ఖర్గే పోస్టులో పేర్కొన్నారు. భారతీయ అవుట్‌సోర్సింగ్‌ను లక్ష్యంగా చేసుకుని చాబహార్ పోర్టు మినహాయింపు ఎత్తివేయడతో మన వ్యూహాత్మక ప్రయోజనాలకు నష్టం వాటిల్లింది. భారతీయ వస్తువులపై వందశాతం సుంకం విధించాలని ఇయు ఇచ్చిన పిలుపు కూడా అంతే అని ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శించారు.

# విదేశాలపై ఆధారపడడమే పెద్ద తప్పు

(మొదటి తరువాయి)

ఆర్థిక వ్యవస్థలా మార్చాలి. ఇతరులతో కలిసి నడుద్దాం కానీ, ఆత్మాభిమానంతో బతుకుదాం. 140 కోట్ల మంది భవిష్యత్తును ఇతర దేశాల మీద వదిలేయబోం అని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం గుజరాత్‌లో పర్యటించారు. ఈసందర్భంగా అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనకు ప్రధాన శత్రువులు ఎవరూ లేరని, కానీ.. విదేశాలపై ఆధారపడటమే మన ప్రధాన శత్రువు అని వ్యాఖ్యానించారు. హెచ్–1బీ వీసాల దరఖాస్తు రుసుమును అమెరికా లక్ష డాలర్లకు పెంచుతున్నట్లు- ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించు కున్నాయి. నేడు భారత్ విశ్వబంధు స్ఫూర్తితో ముందుకుసాగుతోంది. ప్రపంచంలో మనకు ప్రధాన శత్రువులు ఎవరూ లేరు. మన అతిపెద్ద శత్రువు ఇతరదేశాలపై ఆధారపడటమే. దీన్ని మనం ఓడించాలి. విదేశాలపై ఎక్కువగా ఆధారపడితే.. దేశ అభివృద్ధి విఫలమవుతుంది. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం అత్యధిక జనాభా కలిగిన దేశం ఆత్మనిర్భర్‌గా మారాలి. ఇతరులపై ఆధారపడితే మన ఆత్మగౌరవం దెబ్బతింటుంది. భారతదేశ అభివృద్ధిని, భావితరాలను పణంగా పెట్టలేం' అని మోదీ పేర్కొన్నారు. ఈసందర్భంగా దేశం భరించాల్సిన నష్టాల్లో షిప్పింగ్ రంగం ఒకటని మోదీ పేర్కొన్నారు. 50 ఏళ్ల క్రితం మన దేశంలో తయారుచేసిన నౌకలనే మనం ఉపయోగించుకొనేవాళ్లమన్నారు. కానీ, కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన తరువాత ఆ రంగం పూర్తిగా నాశనమైందని ఆరోపించారు. వారి ప్రభుత్వ హయాంలో స్వదేశం లో నౌకల తయారీపై దృష్టిపెట్టకుండా విదేశీ నౌకలకు అద్దెలు చెల్లించేందుకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. అందువల్లే ఇప్పటికీ మన వాణిజ్యంలో 90 శాతం విదేశీ నౌకల పైనే ఆధారపడుతున్నా మన్నారు. ఇందుకుగాను మనం ఏటా రూ.6 లక్షల కోట్లు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఇది దేశ రక్షణ బడ్జెట్ కంటే ఎక్కువన్నారు. దీనికి ముందు భావ్‌నగర్‌లో రూ.34,200 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు.

# నేడు సూర్యగ్రహణం

(మొదటి తరువాయి)

శుభ కార్యాలు చేయకూడదు. సూతక కాలంలో గర్భిణీ స్త్రీలు, పిల్లలు,వృద్ధులు ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాలి. సూర్యగ్రహణాలు గర్భిణీ స్త్రీలను ప్రభావితం చేస్తాయి, ఇది వారి పిల్లలపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. ఆదివారం సర్వ పితృ అమావాస్య రోజున సూర్యగ్రహణం రాత్రి 10:59 గంటలకు ప్రారంభ మవుతుంది. సూర్యగ్రహణం శిఖరం ఉదయం 01:11 గంటలకు సంభవిస్తుంది. సెప్టెంబర్ 22న ఉదయం 03:23 గంటలకు గ్రహణం ముగుస్తుంది. ఆ రోజు నుండి శరత్ నవరాత్రి కూడా ప్రారంభ మవుతుంది. సూర్యగ్రహణం సూతక కాలం అది ప్రారంభమయ్యే 12 గంటల ముందు ప్రారంభమవుతుంది. దీని ఆధారంగా ఈ సూర్యగ్రహణం సూతక కాలం భారత ప్రామాణిక సమయం ప్రకారం సెప్టెంబర్ 21న ఉదయం 10:59 గంటలకు ప్రారంభం కావాలి. సూర్యగ్రహణం పూర్తి కావడంతో సూతక కాలం ముగుస్తుంది. ఈ సంవత్సరంలో ఇదే చివరి సూర్యగ్రహణం. కానీ, ఇది భారతదేశంలో కనిపించదు. ఫలితంగా దీని సూతక సమయం మన దేశంలో చెల్లదు. కాబట్టి, ఈ సూర్యగ్రహణం ప్రభావం ఇక్కడ ఉండదని అంటున్నారు.
అయితే, హిందూ శాస్త్రాల ప్రకారం ఈ గ్రహణాలను అశుభకరంగా భావిస్తారు. ఈ క్రమంలో, ఈ ఏడాదిలో రెండో పాక్షిక సూర్యగ్రహణం సెప్టెంబర్ 21 రాబోతుంది. కాగా, ఈ గ్రహణం ఎఫెక్ట్ భారత్‌లో ఉండదని సమాచారం. అందువల్ల మన దేశంలో సూతక కాలం వర్తించదు. చంద్రుడు సూర్యుడిని పాక్షికంగా కప్పేయడంతో సూర్యకాంతి కొంతమేర తగ్గుతుంది. 2027 ఆగస్టు 2వ తేదీన సంభవించే సూర్యగ్రహణం ఈ దశాబ్దంలోనే అతి పెద్దది అని చెప్పాలి. ఆ తర్వాత 2114వ ఏడాదిలో ఇలాంటి గ్రహణం సంభవించే ఛాన్స్ ఉంది. కాగా, రేపు ఏర్పడే ఈ పాక్షిక సూర్యగ్రహణం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అట్లాంటిక్ మహాసముద్రం, అంటార్కిటికా, పసిఫిక్ మహాసముద్రం వంటి ప్రాంతాల్లోనే కనిపిస్తుంది. సూర్యుడి నుంచి వెలువడే యూవీ కిరణాలు కళ్లకు హానికరం.. కాబట్టి ఈ గ్రహణాన్ని నేరుగా చూడొద్దని నిపుణులు సూచిస్తున్నారు. గ్రహణ సమయంలో గర్భిణీ స్త్రీలు ఇంట్లోనే ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.. ఈ సమయంలో ఆధ్యాత్మిక చింతన చేయడం మంచిదని జ్యోతిష్ట పండితులు తెలియజేస్తున్నారు.

# రేవంత్‌కు కిషన్ రెడ్డి ఫోబియా పట్టుకుంది

(మొదటి తరువాయి)

పాలన, జాతీయ పరిణామాలపై రామ చందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు చేస్తూనే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కూడా తీవ్రంగా విరుచుకుపడ్డారు. రామ చందర్ రావు మాట్లాడుతూ.. శ్యామ్ పిట్రోడా ఇచ్చిన ట్రైనింగ్ కారణంగా రాహుల్ గాంధీ ఈ స్థితికి వచ్చారు. ఇప్పుడు 'ఓట్ల చోరీ' అనే కొత్త నాటకాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వాస్తవానికి ఓట్ల చోరీ ఏదీ లేదు. బోగస్ ఓట్లు- మాత్రం ఉన్నాయి. బోగస్ ఓట్లు- వేరు, ఓట్ల చోరీ వేరు. ఈ తేడా కూడా తెలియని రాహుల్ గాంధీ ఒకసారి ఓట్ల చోరీ అంటారు, ఇంకోసారి హైడ్రోజన్ బాంబ్ అంటారని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా.. 'సిబిఐ మీద మాకు నమ్మకం ఉంది. ప్రభుత్వం రాసిన లెటర్ ఇప్పటికే సిబిఐ
ముందుంది. కఉ÷ూఅ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగానే పీసీ ఘోష్ విచారణ చేపట్టారు. అయితే ఆ విచారణలో నిందితులు ఎవరు అన్నది తేల్చారా? విచారణ తర్వాత రాజకీయ నాయకులను ఎవరినైనా అరెస్ట్ చేశారా?' అని ప్రశ్నించారు. 'టె-్రరిజం, లెఫ్ట్ -టె-్రరిజం రెండూ ఒక్కటే. మావోయిస్ట్‌లతో చర్చలు అనేక సార్లు జరిగాయి. కానీ ఆ చర్చల వల్ల హింస తగ్గలేదు, పెరిగింది. హింస పెరగడం వల్లే ఆపరేషన్ కగార్ ముందుకు వచ్చింది. మావోయిస్ట్‌లతో చర్చలు జరపాలా వద్దా అన్నది కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది' అని స్పష్టం చేశారు.

# నేటినుంచి బతుకమ్మ సంబరాలు

(మొదటి తరువాయి)

ఉత్సవాలు, సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ రెండూ కూడా అమ్మవారిని పూజించే పండుగలే. తెలంగాణలో బతుకమ్మకు ఉన్న ప్రత్యేకతే వేరు. ప్రకృతి రమణీయకతకు బతుకమ్మ నిదర్శనం. ఇదో రకంగా గౌరీపూజను చేయడం.. అమ్మవారికి శరన్నవరాత్రులు ఎలా జరుపుతామో తెలంగాణాలో 9రోజులపాటు బతుకమ్మ వేడుకలను అలా జరపడం ఆనవాయితీ. ఈ 9 రోజుల్లో కూడా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా గుమిగూడా ఆడుకోవడం...ఆడపిల్లలను ఇంటికి రప్పించి వేడుక చేయడం పెద్ద సరదా. తెలంగాణ లోగిళ్లలో కులాలకు అతీతంగా బతుకమ్మను పెద్ద ఎత్తున ఆడుతారు. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలు, నవరాత్రుల దేవీ పూజలతో అంతటా సందడి కనిపించనుంది. రంగురంగుల పుష్ప సౌందర్యాల హంగులతో సింగారించు కొనే బంగరు కల్పవల్లిగా బతుకమ్మను తెలంగాణవాసులు భావిస్తారు. ఓ పళ్లెంలో
గుమ్మడి ఆకులు పరచి, వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. ముందుగా గుమ్మడి పువ్వుల్ని అమర్చి– అక్కడే తంగేడు, బీర, గన్నేరు, నిత్య మల్లె, బంతి వంటి పుష్పాల్నిపేర్చి కూర్చడం కళాత్మకంగా చేస్తారు. అదే పువ్వుల దొంతరపై తమలపాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. మహిళలు లయాత్మకంగా అడుగులు వేస్తూ, చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవన రీతులు, కుటుంబాల అనుబంధాలు, పురాణగాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు. పసుపుబొట్టు పేరిట తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొంటారు. బతుకమ్మను పసుపు, కుంకుమలతో ఆరాధించి వివిధ రకాల పదార్థాల్ని నివేదన చేస్తారు. ఆటపాటల అనంతరం, ప్రతి నిత్యం జలాశయాల్లో నిమజ్జనం చేయడం ఈ సంప్రదాయంలో ఒక భాగం. ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని భావించి, వివిధ పుష్పాలతో పేర్చి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. బతుకమ్మగా పిలిచే గౌరమ్మ అయినా, దేవీరూపాలలోని పదుగురు అమ్మలయిన లలితాదేవి, అన్నపూర్ణ, రాజరాజేశ్వరి, పార్వతి, మహాలక్ష్మి, గాయత్రి, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దని, అపరాజితాదేవి అందరూ పరాశక్తికి చెందిన ప్రధాన, ఉపప్రధాన, అంశాత్మక స్వరూపాలేనని మన పురాణాలు చెబుతు న్నాయి. భూమిమీది మట్టి, చెట్టు, నీరు, నిప్పులలోనే కాదు, గ్రామగ్రామాన వెలసిన ఎల్లమ్మ, బాలమ్మ, పోలేరమ్మ, పెద్దమ్మలు.. వంటి అమ్మలంతా ఆమెకు ప్రతీకలు, ప్రతిరూపాలే. ఇంతేనా, సమస్త సృష్టికే ఆమెనే మూలం.మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు సాగే ఈ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వెదజల్లుతుంది.అందుకే మన జీవన విధానం, సామాజిక ఏకత్వానికి మన పండుగలు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. జాతి చరిత్రకు, సంస్కృతికి, సంప్రదాయ వైభవానికి ఈ ఉత్సవాలు ఉపకరిస్తున్నాయి. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగలో ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ కట్టుబాటు, ఆచారాలు ఇమిడి ఉన్నాయి. సంఘంలో క్రమశిక్షణకు, వ్యక్తుల ఆధ్యాత్మిక సరళికి ఇవి దోహదం చేస్తున్నాయి. ఈ పరంపర లోకే ఆశ్వయుజ మాసంలో నిర్వహించే శరన్నవరాత్రులు కూడా వస్తాయి. ఆటపాటల నేపథ్యంగా, నిత్య జీవన రీతికి అనుగుణంగా ఈ సంబరాల్ని కొనసాగిస్తారు. ప్రాణశక్తి, ప్రాణధాత్రి, ప్రాణేశ్వరి అనే ఆదిశక్తి నామాలకు ప్రతిబింబం. బతుకమ్మ అంటే బతుకునివ్వడంతో పాటు, సకల ప్రాణులకూ జీవశక్తిని అందజేసే ప్రకృతి, ఆకృతి– బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సందడి విలసిల్లుతుంది. పూర్ణత్వానికి సంకేతం– తొమ్మిది. నవ విధ భక్తి మార్గాలకు, నవ నిధులకు ప్రతిబింబంగా బతుకమ్మను తొమ్మిది రకాల పుష్పాలతో తొమ్మిది వరసల్లో అమరుస్తారు. ఈ తొమ్మిది రోజుల్లో– మొదటి, రెండో రోజుల్లో బొడ్డెమ్మగా, మూడో రోజు లక్ష్మీదేవిగా, నాలుగో రోజు గౌరమ్మగా ఆరాధిస్తారు. అయిదో రోజు అట్ల బతుకమ్మగా, ఆరో రోజు అలిగిన బతుకమ్మగా, ఏడో రోజు చకినాల బతుకమ్మగా, ఎనిమిదో రోజు దుర్గమ్మగా, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా ఆరాధించడం సంప్రదాయం. తొమ్మిది రోజులూ గౌరీదేవి 'పూలమ్మ'గా పుట్టింటికి తరలి వచ్చినట్లు భావిస్తారు. తమ ఇంటి ఆడబిడ్డగా బతుకమ్మను భావిస్తూ, ఆరాధన చేస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మకు సాగనంపు వేడుక నిర్వహిస్తారు. గౌరమ్మను అత్తవారింటికి– అంటే, శివుడి వద్దకు పంపుతూ, సకల సౌభాగ్యాలూ అనుగ్రహించడానికి మళ్లీ తరలిరమ్మని వేడుకుంటారు. ప్రకృతి నుంచి ఆవిష్కృతమైన పూల పుంత బతుకమ్మ. జలాల్లో సమ్మిళితమై, చివరికి ఆ ప్రకృతిలోనే మమేకమవుతుంది. పూలతో బతుకమ్మ ఆవిర్భవించడం, ఆటపాటలతో అలరింతగా వేడుక చేయడం, నిమజ్జనంతో అనంత ప్రకృతిలో సంలీనం కావడం అనేవి– జగన్మాత సృష్టి, స్థితి, లయాత్మక తత్వాలకు సంకేతాలుగా భావించాలి. నవరాత్రుల్లో చేసే
చక్రార్చనకు మరో రూపమే బతుకమ్మ ఆరాధన. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తుల సమ్మేళన రూపం ఆమె. 'ప్రకృతిని పూజించండి, పరిరక్షించండి. ఆ ప్రకృతే మిమ్మల్ని రక్షిస్తుంది' అనే సామాజిక ఆత్మీయ సందేశాన్ని బతుకమ్మ అందిస్తుంది.

# కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

(మొదటి తరువాయి)

ఇప్పటికే 150 ఆర్టిసి బస్సులకు యజమానులను చేశామని తెలియజేశారు. మరో 450 ఆర్టిసి బస్సులకు మహిళలను యజమానులను చేయబోతున్నామని, మహిళలు ఇక వడ్డీవ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 7,422 కోట్లు- చెల్లించిందని, 96 లక్షల కుటు–ంబాలకు సన్నబియ్యం అందించామని అన్నారు. 41 వేల రేషన్ కార్డులు ఇచ్చామని, వడ్డీలేని రుణాలతో మహిళలు వ్యాపారాలు చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మహిళలు మహారాణులుగా ఉండాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. గతంలో డబ్బుల కోసం మగవారిపై ఆధారపడే పరిస్థితి ఉండేది. మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం ప్రత్యేక పథకాలు తీసుకువచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మహిళలకు కుట్టుమిషన్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు- చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించాం. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారు. ఉచిత బస్సు సౌకర్యం అందిస్తుంటే.. భారత రాష్ట్ర సమితి ఈ పథకాన్ని అగౌరవపరుస్తూ మహిళలపై విమర్శలు చేస్తోందని




మంత్రి సీతక్క అన్నారు. మహిళల సంక్షేమం, సాధికారత పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, వివేక్‌ల సహకారంతో తెలంగాణ మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల సంక్షేమాన్ని కోరే పార్టీ. ఇందిరమ్మ కాలంలోనే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఉక్కుమహిళగా నిలిచిన ఇందిరా గాంధీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మ – ఇద్దరూ మహిళల సాధికారతకు ప్రతీకలని అన్నారు.గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. నేడు ప్రతి ఏడాది 25 వేల కోట్ల బ్యాంకు రుణాలు మహిళలకు ఇస్తున్నాం. ఆ రుణాలతో మహిళలు పెట్రోల్ బంకులు, శక్తి క్యాంటీ–న్లు, సోలార్ ప్లాంట్లు– ఏర్పాటు– చేస్తున్నారు. మహిళల ద్వారా నడిచే వ్యాపారాలు కోట్లలో ఆదాయాన్ని రాబడుతున్నాయని సీతక్క వివరించారు. నారాయణపేట మహిళా సంఘం ఆరు నెలల్లోనే 13.80 లక్షల ఆదాయం సంపాదించిందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 35 ఇంద్ర మహిళా శక్తి క్యాంటీన్లు మహిళల ద్వారానే నడుస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా.. ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా మహిళా సంఘాలను ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులుగా చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాల యూనిఫామ్‌లు కూడా మహిళా సంఘాల ద్వారానే కుట్టిస్తున్నారు. దీంతో వారికి ఏటా 30 కోట్ల ఆదాయం వస్తోంది. మహిళా సంఘ సభ్యుల కోసం 10 లక్షల ప్రమాద బీమా, రెండు లక్షల లోన్ బీమా కల్పించాం. ఇప్పటి వరకు 40 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాం అని వివరించారు. బీఆర్ఎస్ మహిళలతో దుర్మార్గంగా వ్యవహరించింది. మహిళల 1,800 కోట్ల పొదుపు డబ్బులను కూడా మింగేసింది. నాసిరకం బతుకమ్మ చీరలు ఇచ్చి మహిళలను అవమానపరిచిందన్నారు. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం పై తప్పుడు వీడియోలు సృష్టించి మోసం చేయాలని చూస్తోంది. బతుకమ్మ పండుగను రాజకీయాలతో కలుషితం చేస్తోంది.

# చీఫ్ జస్టిస్‌తో సీఎం రేవంత్ భేటీ

(మొదటి తరువాయి)

సంబంధించి మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకం అంశాలపై చర్చించారు. వివిధ జిల్లాల్లో కోర్టు భవనాల నిర్మాణం తదితర అంశాలు చర్చకు వచ్చాయి. కొత్త జిల్లాల్లో అవసరమైన చోట కోర్టు భవనాలు, మౌలిక వసతులను కల్పించడంతో పాటు– సిబ్బంది నియామకం చేపట్టాలని హైకోర్టు సీజే ప్రభుత్వానికి సూచించారు.

# కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదు

(మొదటి తరువాయి)

కృష్ణాలో క్రికెట్ ఆడుకోవడం తప్ప ఏమీ ఉండదని రేవంత్ ప్రభుత్వానికి చురకలంటించారు. పదేళ్లలో ఆర్డిఎస్ తుమ్మిళ్ల, పాలమూరు– రంగారెడ్డి పూర్తి చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి కూడా కృష్ణా –ట్రైబ్యునల్ విచారణకు వెళ్లాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, సంతోష్ సోషల్ మీడియా తన పైనే దాడి చేస్తున్నాయని, సోషల్ మీడియాలో తనపై దాడిని ప్రజలు గమనిస్తున్నారని కవిత పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే నిరసనలు తెలుపుతామని, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని..ఆమోదించాలని ఛైర్మన్ ను కోరానని చెప్పారు. ఫోన్ ద్వారా కూడా తన రాజీనామాను తెలియచేశానని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్ని పార్టీలు ఉంటే అంత మంచిదని, ప్రజాస్వామ్యంలో కొత్త పార్టీలు వస్తే స్వాగతిస్తామని చెప్పారు. తనతండ్రి పార్టీ పెట్టేప్పుడు కూడా అనేకందిని సంప్రదించారని, తానూ అదే చేస్తున్నానని అన్నారు. తండ్రి పార్టీ నుంచి బహిష్కరణకు గురైన కూతురిని తానేనని అన్నారు. ఆదివారం చింతమడకలో జరిగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ లోకి వెళ్లాలన్న ఆలోచన తనకు లేదని, కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నన్ను తనను సంప్రదించలేదని అన్నారు. సిఎంరేవంత్ రెడ్డి ఎందుకలా అంటున్నారో తెలియదని.. భయపడుతున్నా రేమో? నని ఎద్దేవా చేశారు. నిజానికి వెళితేగిలితే రేవంత్ బయటకు వెళతారేమోనని అన్నారు. కాళేశ్వరం అంశంలో తప్ప మాజీ మంత్రి హరీష్ రావుపై తనకు వేరే కోపం లేదని, ఇరిగేషన్ పై 2016 లోనే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసింట్ కెటిఆర్ కు సూచించానని అన్నారు. నేరుగా సిఎంకే ఫైళ్లు వెళ్తున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసింట్ కెటిఆర్ కు చెప్పానని తెలిపారు.

# ఉగ్రవాద కుట్ర భగ్నం

(మొదటి తరువాయి)

పుల్వామా, షోపియన్‌లో జమ్ముకశ్మీర్ పోలీసులు, కౌంటర్ ఇంటెలిజెన్స్ సిబ్బంది కలిసి సోదాలు నిర్వహించారు. ఉగ్రవాద నేరాలకు సంబంధించిన డిజిటల్ పరికరాలతోపాటు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

# దేశానికి బలహీనమైన ప్రధాని ఉన్నడు

(మొదటి తరువాయి)

విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీనిపై కూడా ప్రధాని మోదీ మౌనంగా ఉంటున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. అంతేగాక 'ఐ రిపీట్, ఇండియా హాజ్ ఎ వీక్ పీఎం' అని పోస్టు పెట్టి, 2017లో 'ఇండియా హాజ్ ఎ వీక పీఎం' అని తాను పెట్టిన పోస్టును గుర్తుచేశారు. రాహుల్‌గాంధీతోపాటు ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు మనీశ్ తివారీ, పవన్ ఖేరా తదితరులు కూడా ట్రంప్ హెచ్1బీ వీసాల జారీకి లక్ష అమెరికన్ డాలర్ల ఫీజు విధించడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ట్రంప్ నిర్ణయంతో కోట్ల మంది భారత యువతకు నష్టం వాటిల్లనుందని చెప్పారు. అమెరికా ఒక క్రమపద్ధతిలో ఇండియాకు ఉచ్చు బిగిస్తోందని విమర్శించారు. పాకిస్థాన్‌తో కాల్పుల విమరణకు ఒప్పించామని చెప్పడం, భారత ఎగుమతులపై సుంకాలను 50 శాతానికి పెంచడం, ఇప్పుడు వీసాలపై రుసుములు విధించడం లాంటివన్నీ అమెరికా ప్లాన్డ్‌గా చేస్తోందని, దీనిపై భారత్ చడీచప్పుడు లేకుండా ఉంటోందని మండిపడ్డారు.

## 2025 సెప్టెంబర్ 21, ఆదివారం తెలుగు పంచాంగం




**మాసం పక్షం**
భాద్రపద మాసం, కృష్ణ పక్షం

**తిథి**
అమావాస్య: Sep 21 12:17 AM Sep 22 01:23 AM
శుక్లత్వ ప్రథమి: తరువాత

**నక్షత్రం**
పూర్వ ఫల్గుని: Sep 20 08:05 AM Sep 21 09:32 AM
ఉత్తర ఫల్గుని: Sep 21 09:32 AM Sep 22 11:24 AM

**శుభ-సమయాలు**
అమృతకాలం: 3:38 AM - 5:21 AM
అభిజిత్ ముహూర్తం: 11:45 AM - 12:33 PM
బ్రహ్మ ముహూర్తం: 4:32 AM - 5:20 AM

**అశుభ సమయాలు**
రాహుకాలం: 4:39 PM - 6:09 PM
యమగండం: 12:09 PM - 1:39 PM
గులికా: 3:09 PM - 4:39 PM
దుర్ముహూర్తం: 4:33 PM - 5:21 PM
వర్జ్యం: 5:18 PM - 7:01 PM

**పండుగలు / విశేషాలు**
బతుకమ్మ ప్రారంభం
మహాలయ అమావాస్య
సూర్యగ్రహణం (కానీ భారతదేశంలో కనిపించదు)

# శృంగేరి స్వామివారికి వేములవాడ రాజన్న ఆలయ ఆహ్వానం

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో శృంగేరి పీఠానికి ప్రత్యేక ఆహ్వానం







**వేములవాడ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి మరియు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారిని ఆలయానికి ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్వయంగా శృంగేరి పీఠానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి, ఆలయ ఇన్‌చార్జ్ స్థానాచారి, నమిలికొండ ఉమేష్ శర్మ, చంద్రగిరి శరత్, శృంగేరి తెలంగాణ రాష్ట్ర బాధ్యులు రాధాకృష్ణ శర్మ తదితరులు ఆయన వెంట ఉన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో జరుగుతున్న రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిని స్వామివారికి వివరించారు. గతంలో కూడా పీఠాధిపతి స్వామివారి సూచనల మేరకు పలు అభివృద్ధి పనులు ప్రారంభించబడ్డాయి. ఆహ్వానాన్ని మన్నించిన స్వామివారు, వచ్చే మాసంలో వేములవాడ రాజన్న ఆలయ దర్శనానికి తప్పకుండా వస్తానని ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆది శ్రీనివాస్ బృందం శృంగేరి శ్రీ శారదా అమ్మవారిని దర్శించి తుంగభద్ర నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# క్రీడలతో ఉల్లాసం

### దూళికట్టలో మండల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



**ఎలిగేడు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్సై మధుకర్ అన్నారు. మండలంలోని దూళికట్ట గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటాలని సూచించారు. వివిధ గ్రామాల నుండి విచ్చేసే క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని టోర్నీ నిర్వాహకులకు సూచించారు. మంచినీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు జెర్సీలు అందజేశారు. మైదానంలో స్వయంగా క్రికెట్ ఆడి యువతలో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూమేష్, మాజీ సర్పంచ్ పరుశరాములు గౌడ్, ఎల్ఐసి సీనియర్ ఏజెంట్ మహేందర్, జాతీయ యువత అవార్డు గ్రహీత కొండ రవి, నిర్వాహకులు శ్యామ్ గౌడ్, విష్ణు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన క్రీడాకారుల ఉత్సాహం టోర్నీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ





**మొయినాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 25 వేల నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మండలంలోని పలు పాఠశాలల్లో పంపిణీ చేపట్టారు. మొయినాబాద్ ప్రాథమిక పాఠశాలకు షాద్నగర్ వాసి, ప్రముఖ వ్యాపారవేత్త గజవాడ నరసింహులు రూ. 25,000 విలువైన సామాగ్రి వాగ్దానం చేశారు. అలాగే చిన్న మంగళారం గ్రామంలోని ఉన్నత పాఠశాలకు రూ. 10,000 విలువైన నోట్ బుక్స్ అందించేందుకు నరసింహులు ముందుకొచ్చారు. ఫరూక్‌నగర్ మండల అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ గుప్తా కూడా రూ. 10,000 విలువైన సామాగ్రి వాగ్దానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గందె సురేష్ గుప్తా మాట్లాడుతూ, "రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 25 వేల నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్, చిన్న మంగళారం పాఠశాలల్లో పంపిణీ చేపట్టాం. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరచడమే మా లక్ష్యం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల అధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ అధ్యక్షులు అన్మారి మురళి గుప్తా, సామాజిక కార్యకర్త నీల రవీందర్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మలిపెద్ది శ్రీనివాస్, మొయినాబాద్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మేడం విశ్వనాథ్, ఉపాధ్యక్షులు నాచం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వీరేందర్, సత్యనారాయణ, సాంబశివుడు, నవీన్ కుమార్, నరేష్, శ్రీనాథ్, శ్రవణ్ కుమార్, అశోక్, ఆనంద్ రవీందర్, లింగం, సంతోష్, పాండు, చంద్రయ్య, వెంకటేశం, భువనేశ్వర్ తదితరులు

# ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



**ఎలిగేడు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, డిజే సౌండ్‌లతో కోలాటాలు, బతుకమ్మ ఆటలు నిర్వహించడంతో పాఠశాలలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. దూళికట్ట గ్రామంలోని గాయత్రి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పద్మాకర్ రాజు, ప్రిన్సిపల్ శ్రీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. విద్యార్థుల్లో సాంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతో ఉపయోగపడతాయి" అని తెలిపారు.

# కేజీబీవీ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ :ఇలా త్రిపాఠి



**నల్లగొండ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వేములపల్లి కేజీబీవీని శనివారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం నుండి పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చినందున విద్యార్థులను తీసుకువెళ్లేందుకు వారి తల్లిదండ్రులు పాఠశాలకు రాగా, జిల్లా కలెక్టర్ విద్యార్థినిల తల్లిదండ్రులతో మాట్లాడారు. భోజనం, చదువు ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు .మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఎస్ ఓ కు సూచించారు.

# మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్వాడ్

### - రక్తదాన శిబిరం



**మహేశ్వరం, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని, మహేశ్వరం బిజెపి కార్యాలయంలో సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు రామిడి వీర కర్ణ రెడ్డి ఆధ్వర్యంలో, సంగం బ్లడ్ బ్యాంక్ సమన్వయంతో శిబిరం ఏర్పాటైంది. రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. "రక్తదానం సేవా భావనకు ప్రతీక. మోదీ జన్మదినాన్ని సామాజిక సేవలతో జరుపుకోవడం గర్వకారణం" అని శ్రీరాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, మాజీ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, బిజెపి కార్యకర్తలు, ప్రాంత ప్రముఖులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపు మోడీ దీపావళి కానుక



**జగిత్యాల, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జగిత్యాల బీజేపీ కార్యాలయంలో శనివారం జీఎస్టీ తగ్గింపు పై విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు మాట్లాడుతూ, "ప్రధాని మోడీ గారు దీపావళి కానుకగా జీఎస్టీ పన్నులను తగ్గించారు. సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వస్తుంది" అని తెలిపారు. "విద్య, వైద్యం, వంట సామాగ్రిపై 0–5 శాతం , నిర్మాణ సామాగ్రి, వాహనాలపై 0–18శాతం పన్నులు అమలవుతాయి. పన్ను తగ్గింపు వల్ల కొనుగోలు శక్తి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి" అని వివరించారు. "యూపీఏ హయాంలో పన్నుల భారంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మోడీ ప్రభుత్వం పారదర్శక విధానాలతో దేశాన్ని నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దింది" అని అన్నారు. 'జీఎస్టీ ద్వారా వసూలైన పన్నులను అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆర్టీసీ చార్జీలు పెంచి, ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉంచింది" అని విమర్శించారు. కార్యక్రమంలో వడ్డేపల్లి శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, చిన్నబొడ్డు పెద్ద గంగారం, జుంబర్తి దివాకర్, సుంకేట దశరథ రెడ్డి, సాంబారి కళావతి, ధోనికెల నవీన్, సుంచు సురేష్, కొక్కు గంగాధర్, గంగుల కొమురెల్లి ఆముదరాజు తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్రావుపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

### బతుకమ్మ సంబరాలు





**రామడుగు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల పరీక్షలు, ఆన్లైన్ హాజరు, దసరా సెలవుల్లో చదువు ప్రాధాన్యతపై ప్రధానోపాధ్యాయులు జ్యోతిర్మయి మేడం వివరించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పిల్లలు చెరువుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే రోజు పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. బతుకమ్మ చరిత్ర, సంస్కృతి విశిష్టతను ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మునగాల కొండలరావు డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ ఉత్సవం





**దేవరకొండ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్, డబ్ల్యూ ఈసీ విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తీరొక్క పువ్వులతో బతుకమ్మలను అలంకరించి, ఆడి పాడుతూ కళాశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంగా మార్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమావత్ రవి మాట్లాడుతూ, "తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల్లో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణవాడిపైన ఉంది. విద్యార్థులు స్వయంగా బతుకమ్మ తయారు చేసి, ఉత్సాహంగా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, సీఈఓ జి.లింగారెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.పృథు, డబ్ల్యూ ఈసీ సెల్ కోఆర్డినేటర్ ఎస్.కే.ఆరిఫా, డాక్టర్ కె.రేణుక తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆల్ఫా మోడల్ పాఠశాలలో చిన్నారుల చేత బతుకమ్మ సంబరాలు



**డిండి,సెప్టెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** డిండి మండల కేంద్రంలో ఆల్ఫా మోడల్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ప్రధానోపాధ్యాయురాలు భారతి ఆధ్వర్యంలో చిన్నారుల చేత బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి దసరా పండుగ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ప్రకాష్, సినీ, లింగమయ్య, భార్గవి, కీర్తి, మహాజున, పూజ, సంధ్య విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కైసర్‌నగర్ పాఠశాలలో బతుకమ్మ ఉత్సవం

### చిన్నారుల సందడి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కైసర్‌నగర్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో శనివారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పాటలతో, ఆటలతో పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంగా మార్చారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ, "బతుకమ్మ అనేది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, మన సంస్కృతికి ప్రతీక. పిల్లలకు చిన్ననాటి నుంచే సాంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది" అని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చందు గారు మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ కేవలం పూలతో ఆడుకునే పండుగ మాత్రమే కాదు. ఇది ప్రకృతిపట్ల గౌరవం, సోదరభావం, తెలంగాణ జీవనశైలికి ప్రతిబింబం. చిన్నారులు ఇలాంటి సంస్కృతిని ఆసక్తిగా స్వీకరించడం హర్షించదగ్గ విషయం. పూలలా ప్రకాశించే మీ భవిష్యత్తు కూడా బతుకమ్మలాగే వికసించాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన యువతిని కాపాడిన లేక్ పోలీసులు



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరిఎక్స్‌ప్రెస్):** లోయర్ మానేరు డ్యామ్ వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించిన కాట్నపల్లి యువతి అఖిల (23)ను హోంగార్డు శ్రీనివాస్ సమయస్ఫూర్తితో కాపాడారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి, బ్లూ కోల్ట్స్ పోలీసుల ద్వారా తండ్రి నర్సయ్యకు అప్పగించారు. హోంగార్డు ధైర్యసాహసాన్ని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ప్రశంసించారు.

# మోడల్ స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**నల్లగొండ సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల నందు శనివారం రోజు విద్యార్థులు బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ ఏ అపర్ణ మాట్లాడుతూ.. పూలనే దేవుళ్లుగా కొలిచే పండగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ నిలుస్తోందదని ప్రతి ఏడాది భాద్రపద అమావాస్య మొదలు ఆశ్వియుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు ఈ పండుగను జరుపుకుంటారని రాష్ట్ర ప్రజలు తమ ఇళ్లలో పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను.. ఒకచోట చేర్చి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ.. పాటలు పాడుతూ ఆనందంగా జరుపుకుంటారని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో పాటలకు ఎంత ప్రాధాన్యత ఉండేదో.. బతుకమ్మ పాటలూ అంతే ప్రాచుర్యం పొందాయని అందుకే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని తెలంగాణ అస్థిత్వ చిహ్నం బతుకమ్మ పండుగను.. వెయ్యేళ్ల నుంచే జరుపుకుంటున్నారని బతుకమ్మకు సంబంధించి అనేక కథలు ఉన్నాయని తెలిపారు అదేవిధంగా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులు.. తొమ్మిది విధాలుగా జరుపుకుంటారని

మొదటిరోజు : ఎంగిలిపూల బతుకమ్మ

రెండో రోజు : అటుకుల బతుకమ్మ (అటుకులు, బెల్లాన్ని ఫలహారంగా తీసుకెళ్తారు)

మూడో రోజు : ముద్దపప్పు బతుకమ్మ (ముద్దపప్పు ఫల హారంగా తీసుకెళ్తారు)

నాల్గో రోజు : నానబియ్యం బతుకమ్మ (పాలు, బెల్లం, నానబెట్టిన బియ్యంతో నైవేద్యం చేస్తారు)

ఐదో రోజు : అట్ల బతుకమ్మ (ఉప్పుడు బియ్యంను అట్లుగా చేసి నైవేద్యం సమర్పిస్తారు)

ఆరో రోజు : అలిగిన (అర్రెం) బతుకమ్మ (ఈరోజు అలి గిన బతుకమ్మగా చూస్తారు. ఎలాంటి నైవేద్యం పెట్టరు)

ఏడో రోజు: వేపకాయ బతుకమ్మ (సకినాల పిండిని వేప కాయల రూపంలో చేసి నైవేద్యం సమర్పిస్తారు)

ఎనిమిదో రోజు : వెన్నముద్ద బతుకమ్మ (నువ్వులు, వెన్న, బెల్లం కలిపి ఫలహారం చేస్తారు)

తొమ్మిదో రోజు : సద్దుల బతుకమ్మ (అన్నిరకాల ఫలహా రాలు చేసి నైవేద్యం పెడతారు) జరుపుకుంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## జడ్పిహెచ్ఎస్‌లో బతుకమ్మ ఉత్సవం



**అడవిదేవులపల్లి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో దసరా పండుగను పురస్కరించుకొని బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆడి పాడుతూ పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంగా మార్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.వరలక్ష్మి, ఎస్.శ్రీనివాసరావు, ఏ.ఉమాశంకర్, మునిశ్వరి, సూర్యకాంతం, శోభ, విద్యచందర్, నాయక్ రాజ్యలక్ష్మి, భారతి, లోక్య నాయక్ శ్రీను, అరుణ, కృష్ణబాబు, అమీరుద్దీన్, కృష్ణవేణి, రేణుక, బి.శ్రీను, శ్రీశైలం, సాయి కిరణ్, నాగేశ్వర శాస్త్రి, సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇల్లంతకుంట మండలంలోని నరేడిపల్లి, తాళ్లపల్లి, ముస్కానిపేట, సిరికొండ గ్రామాల్లో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలిసి శనివారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సత్వరమే మరమ్మత్తులు చేపట్టాలని ఎమ్మెల్యే కోరగా, కలెక్టర్ హామీ ఇచ్చారు. సిరికొండ గ్రామంలో 45 మంది ఎస్సీలకు అసైన్డ్ భూములు కేటాయిస్తే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ అంగీకారం తెలిపారు. పర్యటనలో తహసీల్దార్ ఫారుఖ్, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య యాదవ్, పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, ఎలగందుల ప్రసాద్, పసుల వెంకటి, కోలాపురి అంతగిరి, రజనీకాంత్, వీరేశం, వెంకటరెడ్డి, తీగల పుష్పలత, జ్యోతి, మామిడి రాజు, నేరెళ్ల విజయగౌడ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత ర్యాలీ, మెగా వైద్య శిబిరం




**తూప్రాన్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వచ్ఛత ఈ సేవ 2025 కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులచే స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తదనంతరం పురపాలక సంఘం, సీఎంఆర్ హాస్పిటల్ బృందం సంయుక్తంగా మున్సిపల్ సానిటేషన్ వర్కర్లకు, స్థానిక ప్రజలకు మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

## నియోజకవర్గస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థులు




**తిప్పర్తి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తిప్పర్తి మండల కేంద్రం లోని మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు నల్లగొండ నియోజకవర్గం క్రీడోత్సవాలు 2025లో భాగంగా నిర్వహించిన క్రీడలలో బాలురు ఖో-ఖో అండర్ 17 పోటీలలో కే ఆదిత్య, ప్రథమ, అండర్ 14 లో సిహెచ్ నవదీప్ ప్రథమ ,బాలురు వాలీబాల్ అండర్ 14 లో సిహెచ్ ఉమేష్ , జి అభిరామ్, జె. శశాంక్ ప్రథమ, అండర్ 17 బాలురు లో కే శవ కుమార్ ద్వితీయ స్థానం, అదేవిధంగా బాలికల వాలీబాల్ విభాగంలో అండర్ 17 లో మౌనిక డివిజన్ స్థాయికి ఎంపిక కావడం జరిగిందని ఒకే పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని ప్రిన్సిపాల్ ఏ అపర్ణ తెలిపారు తమ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రానిస్తున్న ట్లు తెలిపారు ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ అనురాధ ను అభినందించారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు




**కడ్తాల్, సెప్టెంబర్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నేటి నుండి పాఠశాలలకు దసరా సెలవలు కావడంతో ఫార్చ్యూన్ బటర్ఫ్లై స్కూల్లో దసరా సంబరాలు అంబరాన్నంటాయి ముఖ్యఅతిథిగా ప్రభాస్ శ్రీను పాల్గొన్నారు తెలంగాణ అంటేనే బతుకమ్మ అని మన తెలంగాణలో పూలని పూజించడం ఒక సాంప్రదాయమని బతుకమ్మ యొక్క ప్రాధాన్యతను వివరించారు విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ ఆశీస్సులు దుర్గామాత ఆశీస్సులు అందరి మీద ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నవరాత్రుల యొక్క ప్రాధాన్యతను నృత్య రూపంలో తెలిపారు దీనికి పాఠశాల వ్యవస్థాపకులు శ్రీ శేషగిరి రావు, సహా వ్యవస్థాపకులు రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, రంగ రావు, విద్యార్థులు,ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర స్వామిని దర్శించిన ఎమ్మెల్యే గండ్ర

### సీఎం సహాయనిధి ఆపద్బాంధవునిలా ఆదుకుంటుందని వ్యాఖ్య



**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాళేశ్వరం శ్రీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణీంద్ర శర్మ వేదాశీర్వచనాలతో సన్మానించారు. భూపాలపల్లి, గణపురం, రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని 167 మంది లబ్దిదారులకు 55.18 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పేదలకు ఖరీదైన వైద్యం అందించేందుకు సీఎం సహాయనిధి ఆపద్బాంధవునిలా నిలుస్తోందని ఎమ్మెల్యే గండ్ర పేర్కొన్నారు.

# మహేశ్వరం మండలంలో వృద్ధులు -వితంతువులు -వికలాంగుల నిరసన





**మహేశ్వరం,సెప్టెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ముందు ఈరోజు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వృద్ధులు,వితంతువులు,వికలాంగులు నిరసన తెలిపారు.గ్రామ సెక్రటరీలకు వినతిపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి రావుగల బాబు మాదిగ,ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండల ఇన్చార్జి బక్కని రవి మాదిగ హాజరయ్యారు.అనంతరం మాట్లాడుతూ:-కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం వికలాంగులకు రూ.6,000,ఇతర ఆసరా పెన్షన్లు రూ.4,000,తీవ్ర వికలాంగులకు రూ.15,000 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న




బకాయిలను చెల్లించడంతో పాటు కొత్త దరఖాస్తుదారులందరికీ దరఖాస్తు తేదీ నుండి పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.లేని పక్షంలో వృద్ధులు,వితంతువులు, వికలాంగుల శక్తి ఏంటో త్వరలోనే చూపిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమం కల్వకోల్, గట్టుపల్లి, నాగారం, దుబ్బచర్ల, ఆకన్‌పల్లి, మంచన్పల్లి, నాగిరెడ్డిపల్లి, సుభాన్‌పూర్, పెండ్యాల, రావిరాల, గంగారం, తుమ్మలూరు తదితర గ్రామాలలో జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగ,ఎంఎస్పీ మహేశ్వరం మండల అధ్యక్షుడు ఎర్ర కృష్ణ మాదిగ,మాజీ మండల అధ్యక్షుడు జంగన్న మాదిగ,మండల ప్రధాన కార్యదర్శి అర్జున్ మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్ మాదిగ,గూడెం రాములు మాదిగ,ఆశపల్లి శంకరయ్య మాదిగ,కొండని మహేందర్ మాదిగ తదితరులు.భారీ ఎత్తున వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

## నల్లగొండ పట్టణంలో పలు పెట్రోల్ బంకులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పౌరసరఫరాల శాఖ అధికారులు



**నల్లగొండ ,సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంక్ లల్లో మౌలిక సదుపాయాలు లేకపోతే నిర్వాహకులపై కేసుల నమోదు చేస్తామని పలు బంకు యాజమాన్యం ను హెచ్చరించిన పౌర సరఫరాల శాఖ అధికారులు. ప్రతి పెట్రోల్ బంక్ నిర్వాహకులు ప్రభుత్వానికి సంబంధించిన నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఫిల్లింగ్ స్టేషన్లలో వినియోగదారులకు సరియైన సదుపాయాలు, త్రాగునీరు, గాలి నింపే యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఫీలింగ్ స్టేషన్ యాజమాన్యాలకు సూచనలు చేశారు వినియోగదారులకు అసౌకర్యాలు కలిగిస్తే ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు ఎటువంటి ఆటంకాలు, సమస్యలు కలిగిన పౌరసరఫర శాఖ ను సంప్రదించాలని సూచించారు పౌరసరఫరాల శాఖ ఇన్ఫోసిమెంట్ డిప్యూటీ తహసిల్దార్ మాచన రఘునందన్, మరియు సయ్యద్ ముబీన్ తదితరులు ఉన్నారు.

## బిజెపి నేత కడారి బాబు కన్నుమూత

### నివాళులర్పించిన శ్రీరాములు



**మహేశ్వరం, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తుమ్మలూరు గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు కడారి బాబు (బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్య యాదవ్ సోదరుడు) శుక్రవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా ఆయన బాబు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు యాదిష్, రాష్ట్ర, జిల్లా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజ్ఞాపూర్ చెరువు ముంపుకి శాశ్వత పరిష్కారం కోసం బిజెపి డిమాండ్





**గజ్వేల్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞాపూర్ ఊర చెరువు కాలువలు మూసివేయడం వల్ల పలు కాలనీలు, హాస్పిటల్స్ ముంపుకు గురవుతున్నాయని బిజెపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ పార్దేశ్వర దేవాలయం కాలనీవాసులకు మద్దతుగా బిజెపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ మాట్లాడుతూ, "బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఈ ముంపుకు కారణం. కాలువలు మూసిన వారిపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం శోచనీయం" అన్నారు. కలెక్టర్, మున్సిపల్ అధికారులు వెంటనే కాలువల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే బిజెపి పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతుందని హెచ్చరించారు.కార్యక్రమంలో బిజెపి జిల్లా, పట్టణ నాయకులు, పార్థేశ్వర కాలనీవాసులు, ఏబీసీ చిల్డ్రన్, యశస్వి ఆర్థోపెటిక్ హాస్పిటల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 22న జిల్లా స్థాయి చదరంగం పోటీలు



**ఎలిగేడు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా చదరంగ సమైక్య మరియు పడాల నాగరాజు ఆధ్వర్యంలో, కీర్తిశేషులు పడాల చిన్న మల్లయ్య గౌడ్ జ్ఞాపకార్థంగా సెప్టెంబర్ 22 సోమవారం రోజున జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు ఎలిగేడు మండల చదరంగ సమైక్య ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు తెలిపారు. ఈ పోటీలు పెద్దపల్లి పట్టణంలోని అమర్చంద్ కళ్యాణమండపం (రిక్రియేషన్ క్లబ్) లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. ఎంట్రీ ఫీజు రూ.100 కాగా, మధ్యాహ్న భోజన వసతి క్రీడాకారులకు కల్పించబడుతుంది. జిల్లాలోని ప్రతిభావంతులైన చదరంగ క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఆయన కోరారు. పోటీల్లో గెలుపొందిన మొదటి ఎనిమిది మంది క్రీడాకారులకు రూ.6000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక సర్టిఫికెట్ అందజేయబడుతుంది. వివరాలకు తాటిపల్లి సతీష్ బాబు (94943 64360) ను సంప్రదించాలని సూచించారు.

## రంగాయపల్లిలో బతుకమ్మ ఉత్సవం



**మనోహరాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగాయపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ ఆడి ఉత్సాహంగా గడిపారు.కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సంజీవ రావు, ఉపాధ్యాయులు మురళి మనోహర్, రాఘవేంద్ర, అరుంజ్యోతి, భాగ్యలక్ష్మి, శిరీష, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

## డా. మామిడి హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన గుత్తికొండ కిరణ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ శనివారం రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుత్తికొండ కిరణ్ మాట్లాడుతూ, "దైవం మనుష్య రూపేణ అనే సామెతకు న్యాయం చేసే వ్యక్తి డా. మామిడి హరికృష్ణ గారు. అధికారి అనే గర్వం లేకుండా నిస్వార్థంగా పనిచేసే మంచి మనసున్న వ్యక్తి. వికలాంగులకు రవీంద్ర భారతి హాల్స్ ఉచితంగా అందించడంలో ఆయన చూపిన సహకారం మరువలేనిది" అని పేర్కొన్నారు. "మీ పలకరింపు, ధైర్యం ఇచ్చే మాటలు నా మనసును తాకాయి. భవిష్యత్తులో కూడా మీ సేవలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను" అని కిరణ్ తెలిపారు.

## పింఛన్ హామీ నెరవేర్చాలి

### జవహర్ నగర్‌లో ధర్నా



**జవహర్ నగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆసరా పింఛన్ దారులు శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి గౌరవాధ్యక్షులు వంగ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "మెనిఫెస్టో ప్రకారం పెన్షన్ పెంచాలి. వికలాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి" అని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మోనార్ దుర్గాప్రసాద్, టైగర్ నరసింహ, నేతి శ్రీధర్, కొత్త నరేష్ మాదిగ, కొయ్యడ వెంకటేష్, మొగిలిపాక పరుశురాం, బూడిద వెంకటేష్, విక్రమ్, నాయకులు, వృద్ధులు, వితంతువులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి సర్కార్ పెద్దపీట



**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సంక్షేమ పథకాల అమలుతో పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఇల్లంతకుంట మండల పరిషత్ సమావేశ మందిరంలో 19 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, 51 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆర్థిక ఇబ్బందుల మధ్య కూడా పేదల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరంగా అమలు చేస్తోంది. పెళ్లిళ్లకు భారం తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి, వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తున్నాం" అని తెలిపారు. 19వ విడతలో 15.28 లక్షల రూపాయలు మంజూరై, లబ్ధిదారులకు చెక్కులు అందజేశామని పేర్కొన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ ఫారుఖ్, ఎంపీడీవో వై.శశికళ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య యాదవ్, పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, ఎలగందుల ప్రసాద్, పసుల వెంకటి, కోలాపురి అంతగిరి, రజనీకాంత్, వీరేశం, వెంకటరెడ్డి, తీగల పుష్పలత, జ్యోతి, మామిడి రాజు, నేరెళ్ల విజయగౌడ్, అమర్, యాశ్వాడ తిరుపతి, గుంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి దుర్గామాత పోస్టర్ విడుదల



**మహేశ్వరం, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో శ్రీశ్రీశ్రీ మహాశక్తి బొడ్రాయి దుర్గామాత వాల్ పోస్టర్లను రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుండే కుమార్ శనివారం విడుదల చేశారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపీ చామల

**హైదరాబాద్ సెప్టెంబర్ 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : సిద్దిపేట జిల్లాలోని దూల్మిట్ట మండలం భైరన్ పల్లి గ్రామాన్ని వీర భైరన్ పల్లిగా మార్చాలని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి శనివారం హైదరాబాదులోసీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..ఇటీవల జరిగిన సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ వియోచన దినోత్సవం సందర్భంగా భైరన్ పల్లి గ్రామంలోని రజాకార్ల దాడిలో విరోచితంగా పోరాడి అమరులైన వారి కి నివాళులర్పించి రూ,10 లక్షలు స్తూపం,బురుజు అభివృద్ధి కోసం ఇచ్చినట్లు తెలిపారు.గ్రామ ప్రజల కొరికా మేరకు భైరన్ పల్లి గ్రామాన్ని విర భైరన్ పల్లి గ్రామంగా పేరు మార్చాలని తమ దృష్టికి తీసుకురాగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గ్రామ ప్రజల కోరిక నెరవేర్చే విధంగా కృషి చేస్తానన్నారుగ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డీ వివరిస్తూ.. మనకు 1947 ఆగస్టు 27న సిద్ధిపేట జిల్లా, దూల్మిట్ట మండలం, బైరాన్‌పల్లి



గ్రామంలో జరిగిన విషాదకరమైన మరియు చారిత్రాత్మక సంఘటనను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. తెలంగాణ చరిత్రలో చీకటి అధ్యాయాలలో ఒకటిగా మిగిలిపోయిందని తెలిపారు. నిజాం పాలనలో, రజాకార్లు దారుణాలకు పాల్పడ్డారని, డబ్బు వసూలు చేయడమే కాకుండా అమాయక గ్రామస్తులను వేధించారని గుర్తుచేశారు. ఈ దురాగతాలను ఎదిరించి తమ గ్రామాన్ని రక్షించుకోవడానికి బైరన్‌పల్లి ప్రజలు ఒక రక్షణ బృందాన్ని ఏర్పాటు చేసారని, ప్రతీకారంగా, రజాకార్లు గ్రామాన్ని ఐదుసార్లు చుట్టుముట్టి క్రూరమైన దాడులకు దిగారని తెలిపారు. చివరి దాడిలో, దాదాపు 1,200 మంది రజాకార్లు గ్రామంపై దాడి చేసి, 126 మంది అమాయక గ్రామస్తులను నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో మహిళలు కూడా తీవ్ర దారుణాలకు గురయ్యారన్నారు. ఈ ఊచకోతను ఆ సమయంలో జలియన్ వాలాబాగ్ విషాదం కంటే భయంకరమైనదిగా అభివర్ణించారు. బైరన్‌పల్లి గ్రామస్తుల ప్రతిఘటన మరియు త్యాగం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ధైర్యానికి చిహ్నంగా నిలుస్తాయి. గ్రామస్తుల అత్యున్నత త్యాగం మరియు పరాక్రమానికి గుర్తింపుగా, అమరవీరుల వీరోచిత వారసత్వాన్ని రాబోయే తరాలకు గుర్తుంచుకునేలా గ్రామం పేరును అధికారికంగా "వీర భైరన్ పల్లి"గా మార్చాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డీ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని అభ్యర్థించగా ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డీ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

## శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్ లో బతుకమ్మ వేడుకలు



**యాదాద్రి సెప్టెంబర్ 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
భువనగిరి జిల్లా కేంద్రం శివారులోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ లో బతుకమ్మ వేడుకలు ఎంతో ఉత్సాహంగా అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు తోటకూర యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న పండుగ బతుకమ్మ పండుగ. రంగు రంగుల పువ్వులను బతుకమ్మగా పేర్చి, గౌరమ్మను పూజించి మహిళలు ఆడుతూ ఉత్సాహంగా చేసుకునే పండుగ -బతుకమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## గాంధీ నగర్ ఐలా అభివృద్ధికి మద్దతు

### ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీ నగర్ ఐలా నూతన కార్యవర్గ సభ్యులు శనివారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పారిశ్రామిక వాడ అభివృద్ధికి, మౌళిక వసతుల కల్పనకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు" అని తెలిపారు. కార్యక్రమంలో ఐలా ఛైర్మన్ పి. స్వామి గౌడ్, కార్యదర్శి వి. రవీందర్ రావు, సంయుక్త కార్యదర్శి టి. సుధాకర్, సభ్యులు వై. జగదీష్, ఎం. సురేష్, అఖిల్, శివకుమార్ తయాల్, శివార్జున్, భద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలిగేడు ఫోటోగ్రాఫర్లకు రాష్ట్ర సంఘం అభినందన




**ఎలిగేడు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్‌లో శనివారం జరిగిన స్టేట్ లెవెల్ ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమంలో ఎలిగేడు మండల పరిధిలోని ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుతమైన ఫోటోలు తీస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రఫీ సంఘం అధ్యక్షులు ఎస్.కె. హుస్సేన్, ప్రధాన కార్యదర్శి సిరి రవి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎలిగేడు మండల ఫోటోగ్రాఫర్లను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీధర్, రాజశేఖర్, అజయ్, గణేష్, మహేందర్, వెంకటేష్, పవన్ కుమార్, రాజు, శివకుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యపై కేంద్రాన్ని నిలదీయాలి

### – డివైఎఫ్ఐ




**అచ్చంపేట, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డివిజన్ డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వర్ధం సైదులు పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. "యువతకు ఉపాధి హామీలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 10 ఏళ్లలో మోసం చేసింది. 2012లో 2.1% ఉన్న నిరుద్యోగం 2025 నాటికి 7.1%కి పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఉద్యోగ అవకాశాలు తగ్గిస్తున్నది" అని వారు పేర్కొన్నారు. "కార్పోరేట్లకు రూ.14.5 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తూ, నిరుద్యోగుల హక్కులను విస్మరిస్తున్నది" అని విమర్శించారు. "పేపర్ పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. లేకపోతే యువత తిరుగుబాటుకు సిద్ధమవుతుంది" అని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు రంజిత్ కుమార్, మహేష్, కమిటీ సభ్యులు బుచ్చపతి, గోపాల్, రవి చరణ్, నవీన్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చౌరస్తాలో ఫ్లెక్సీలు, జెండాలకు నో

### కమిషనర్, సీఐకి వినతిపత్రం




**అచ్చంపేట, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రైవేటు, ప్రభుత్వ, రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, తోరణాలు కట్టకూడదని డివిజన్ అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్, సీఐలకు వినతిపత్రం అందజేశారు. 'అంబేద్కర్ చౌరస్తా గౌరవప్రదమైన స్థలం. ఇక్కడ నోటీస్ బోర్డ్ ఏర్పాటు చేసి, చట్టవిరుద్ధంగా ఫ్లెక్సీలు కట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి" అని సంఘం తరపున విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పాతుకుల శ్రీశైలం, కోశాధికారి కొంకి విజయ్, సలహాదారులు పిల్లి హరిచంద్ర, బిసమల ఆనంద్, మండారి ప్రభాకర్, మోతే పెంటయ్య, అడ్వకేట్ ప్రశాంత్, కౌన్సిలర్లు మోయిస్, రాఘవులు, పాతుకుల శ్యామ్ సుందర్, మాజీ కౌన్సిలర్ హుస్సేన్, మండారి పర్వతాలు, ముత్యాలు, తూర్పాటి రాజారాం, రాంజీ, చిన్న అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ శాంతి అవార్డు



**కందుకూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ శాంతి అవార్డు 2025 ఎంపికైంది. అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా రాష్ట్రం నుంచి ఒక్కరికి ఇచ్చే ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసినట్టు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఢిల్లీ శివకుమార్ ముదిరాజ్ ప్రకటించారు. దెబ్బడగూడ గ్రామానికి చెందిన జంగారెడ్డి గత 25 ఏళ్లుగా గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటీసీగా సేవలందిస్తూ బలహీన వర్గాల అభివృద్ధి, యువత, మహిళా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఉచిత ఆరోగ్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, సామరస్యం వంటి అంశాల్లో లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ప్రశంసలు పొందారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.12 కోట్ల గంజాయి స్వాధీనం

### దుబాయ్ నుంచి వచ్చిన భారతీయ మహిళ అదుపులో డీఆర్ఐ ఇంటలిజెన్స్ ఆధారంగా సీజ్ చేసిన అధికారులు



**( శంషాబాద్ సెప్టెంబర్ 20: నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల కేంద్రంలోని..... శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు భారీగా విదేశీ గంజాయిని పట్టుకున్నారు. దాని విలువ సుమారు రూ.12 కోట్లుగా ఉంటుందని అంచనా. దుబాయ్ నుంచి వచ్చిన భారతీయ మహిళ దీనిని రవాణా చేస్తూ పట్టుబడింది. ఇంటలిజెన్స్ ఆధారంగా డీఆర్ఐ హైదరాబాద్ జోన్ అధికారులు ఆ మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె లగేజ్ బ్యాగ్ తనిఖీ చేయగా సుమారు 6 కేజీల హైడ్రోపోనిక్ గంజాయి బయటపడింది. అనంతరం ఆమె మరో లగేజ్ తప్పిపోయిందని ఫిర్యాదు చేయగా అది ఈ రోజు హైదరాబాద్‌కు చేరింది. అందులోనూ మరో 6 కేజీల గంజాయి స్వాధీనం అయింది. మొత్తం 12 కేజీల హైడ్రోపోనిక్ గంజాయి విలువ రూ.12 కోట్ల వరకు ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై ఆ ప్రయాణికురాలిని అదుపులోకి తీసుకుని డీఆర్ఐ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వివేక విద్యా భారతిలో బతుకమ్మ ఉత్సవం





**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక వివేక విద్యా భారతి పాఠశాలలో శనివారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆడి పాడుతూ పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంగా మార్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్, ఉపాధ్యాయులు మల్లేష్, కిషోర్, నజీర్, శివ, శంకర్, అజ్ర, స్వప్న, రత్నకుమారి, మీనా, అరుణ, షమీమ్, స్వాతి, విజయ రమ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి





**ఇబ్రహీంపట్నం , సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
:సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం.మహేందర్ రెడ్డి అన్నారు. ఇబ్రహింపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అట్టి నేరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పాటించవలసిన పద్దతుల గురించి తరచుగా ఇబ్రహీంపట్నం పోలీస్ వారు ప్రజలతో విద్యార్థులతో మమేకమై అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరాల పట్ల విద్యార్థుల్లో మరింత అవగాహన కల్పించడానికి ఇబ్రహీంపట్నం పోలీస్ వారి సౌజన్యంతో నాగురునానక్ ఇంజినీరింగ్ కాలేజీలో సదస్సు ఏర్పాటు చేసి ప్రికుస ప్రైవేట్ లిమిటెడ్ అదినేత మరియు ప్రఖ్యాత గాంచిన ఎంటర్ప్రెన్యూర్ ప్రమీల్ అర్జున్ తో విధ్యార్థులకు సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ
ఉద్యోగాలు ఇప్పిస్తామని, లోన్ ఇప్పిస్తామని ఫోన్ చేసి సంప్రదిస్తే వాటిని నమ్మవద్దని సూచించారు. అపరిచితులకు కేవైసీ గురించి అలాగే బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీ,ఎం ఆధార్, పాన్‌కార్డు ఇతర వివరాలు తెలుపవద్దని అన్నారు. అలాగే ఇన్స్టాగ్రామ్ కానీ పేస్ బుక్ లో కొత్త వ్యక్తులు పరిచయం అయినపుడు జాగ్రత్తగా ఉండాలని. సైబర్ మోసానికి గురైన బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విద్యార్థులు ... పాల్గొన్నారు

## సీఎంఆర్ పూర్తి చేసి ఉండి, బ్యాంకు గారంటీలు సమర్పించిన మిల్లర్లకే 2025-26 ఖరీఫ్ సీజన్లో వరి ధాన్యం

### అదనపు కలెక్టర్



**వనపర్తి,సెప్టెంబర్ 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
గత సీజన్లలో సీఎంఆర్ పూర్తి చేసి ఉండి, ఇపుడు బ్యాంకు గారంటీలు సమర్పించిన మిల్లర్లకే 2025-26 ఖరీఫ్ సీజన్లో వరి ధాన్యం కేటాయించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 430 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సారి 4.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పీపీసీ లకు వస్తుందని అంచనా ఉన్నట్లు చెప్పారు. ఈ సీజన్లో మిల్లర్లకు ఇబ్బంది లేకుండా క్లీనర్ లు ఏర్పాటు చేయించి ధాన్యం క్లీన్ గా, నిర్దేశించిన తేమ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గత సీజన్లలో సీఎంఆర్ పూర్తి చేసి ఉండి, ఇపుడు బ్యాంకు గారంటీలు సమర్పించిన మిల్లర్లకే 2025-26 ఖరీఫ్ సీజన్లో వరి ధాన్యం కేటాయించడం జరుగుతుందని చెప్పారు. డీఫాల్టర్ లకు పెండింగ్ పూర్తి చేస్తేనే కొత్తగా ధాన్యం కేటాయించడం జరుగుతుంది అన్నారు. ఇక గత ఖరీఫ్ సీజన్ కి సంబంధించి పెండింగ్ సీఎంఆర్ ఇవ్వాల్సిన మిల్లర్లు నవంబర్ 12 తేదీ లోపు సమర్పించాలని ఆదేశించారు. మిల్లర్లు వారికి కేటాయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మాత్రమే ధాన్యాన్ని దింపుకోవాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, పౌర సరఫరాల సంస్థ డి ఎం జగన్మోహన్, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# బెంచీల కోసం కూలీలుగా మారిన విద్యార్థులు



**జగిత్యాల, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పురానిపేట ప్రభుత్వ పాఠశాలలో బెంచీల కొరత కారణంగా విద్యార్థులే కూలీలుగా మారి తరగతి గదులకు బెంచీలు తరలించిన ఘటన కలకలం రేపుతోంది. నిధుల లేమి కారణంగా జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల పాఠశాల నుంచి 10 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులతోనే బెంచీలు మోపించారు."చదువుకోవాల్సిన విద్యార్థులను ప్రమాదంలోకి నెట్టడం బాధాకరం" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



**కరీంనగర్,సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ యువతిని మోసం చేయడమే కాకుండా, ఆమె ఇంటికి నిప్పంటించడానికి ప్రయత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ ఎస్సై జి రాజన్న తెలిపారు.ఎస్సై రాజన్న తెలిపిన వివరాల ప్రకారం, పట్టణానికి చెందిన చెక్కిళ్ల శివసాయి అనే వ్యక్తి, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఓ 24 ఏళ్ల యువతిని పరిచయం చేసుకున్నాడు. శివసాయి తరచూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో గత సంవత్సరం ఆగస్టులో ఆమె నుంచి రెండు తులాల బంగారు చైన్‌ను తీసుకున్నాడు. అయితే, శివసాయి మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకపోవడంతో యువతి అతనికి దూరంగా ఉండటం ప్రారంభించింది. దీంతో ఆగ్రహానికి గురైన శివసాయి ఈ నెల 7న అర్ధరాత్రి తన స్నేహితుడితో కలిసి యువతి ఇంట్లో నిద్రిస్తుండగా, ఇంటి ముందు పెట్రోల్ పోసి నిప్పంటించడానికి ప్రయత్నించాడు. పెట్రోల్ వాసన రావడంతో కుటుంబ సభ్యులు కేకలు వేయగా, నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేసి శివసాయిని అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై రాజన్న వెల్లడించారు. ఈ కేసులో సహకరించిన సిబ్బందిని ఎస్సై అభినందించారు.

# దివ్యాంగుల పింఛన్ పెంపుక ఆందోళనకు బోడిగే శోబ



**రామడుగు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామడుగు మండలంలోని గోపాలరావుపేట గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం వికలాంగులు నూతన పింఛన్లు మంజూరు చేయాలని, రూ.6000 పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ బోడిగే శోబకు చేరుకొని మద్దతు ప్రకటించారు. "ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడిచినా అమలు చేయకపోవడం బాధాకరం. వికలాంగులు రోడ్లపై ధర్నాలు చేయాల్సిన పరిస్థితి తీసుకురావడం దురదృష్టకరం" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీజేపీ పార్టీ అన్ని వేళలా దివ్యాంగుల పోరాటానికి అండగా ఉంటుంది. వెంటనే రూ.2000 పెంపు చేసి, అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయాలి. లేకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాం" అని హెచ్చరించారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, ఒంటెల కరుణాకర్ రెడ్డి, పోచంపెల్లి నరేష్, పురేళ్ల శ్రీకాంత్ గౌడ్, సంటి జితేందర్, బండారి శ్రీనివాస్, మాడిశెట్టి జయంత్, పల్లపు చిరంజీవి, పీచు రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెట్వర్క్ హాస్పిటల్స్ సమ్మె విరమణ

### -ఆరోగ్య శ్రీ సేవలు పునఃప్రారంభం



**హనుమకొండ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులుగా నిలిచిపోయిన ఆరోగ్య శ్రీ సేవలు నేటి నుంచి మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్ చేపట్టిన సమ్మె విరమణకు ప్రధాన కారకుడిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆరోగ్య శ్రీ బకాయిలు, విధానాలపై ఏర్పడిన విభేదాల నేపథ్యంలో, నాయిని ప్రభుత్వం ఆసుపత్రుల యాజమాన్యాల మధ్య వారధిగా వ్యవహరించారు. ప్రత్యక్ష చర్చలు, సమన్వయ ప్రయత్నాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి దోహదపడ్డారు.ఈ పరిణామంతో ఆరోగ్య శ్రీ గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో మళ్లీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వేలాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది ఊరట కలిగించిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# వనపర్తిలో చిన్నారుల బతుకమ్మ సందడి







**వనపర్తి, సెప్టెంబరు 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
జిల్లా కేంద్రంలోని తపస్విని కిడ్స్ ప్లే స్కూల్ బ్రాహ్మణ విధి పాఠశాలలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.రేపటి నుంచి పాఠశాలకు సెలవులు ఉండటంతో చిన్నారులు ఒకరోజు ముందుగానే బతుకమ్మను తయారు చేసి, పాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయినీలు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి బతుకమ్మను అలంకరించి మధ్యలో ఉంచగా, చిన్నారులు చుట్టూరా తిరుగుతూ పూల పాటలతో వాతావరణాన్ని ఆనందభరితంగా మార్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించగా, పాల్గొన్న వారంతా పూల పండుగ ఆత్మస్ఫూర్తిని ఆస్వాదించారు.

## ఉత్సాహంగా ప్రారంభమవుతున్న తెలంగాణ సాంస్కృతిక గర్వకారణం బతుకమ్మ పండుగ




**వనపర్తి,సెప్టెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ సాంస్కృతిక గర్వకారణమైన బతుకమ్మ పండుగ రేపటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా ప్రారంభం కానుంది. తొమ్మిది రోజుల పాటు పూల పరిమళంతో జరగబోయే ఈ పండుగలో ప్రతి రోజూ ప్రత్యేకతతో కూడిన బతుకమ్మలను మహిళలు, బాలికలు అలంకరించి సాంప్రదాయ గీతాలు ఆలపిస్తూ ఆడిపాడతారు.ఎంగిలి పూల బతుకమ్మ, అట్కుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మ అనే తొమ్మిది రోజుల ఉత్సవ క్రమం బతుకమ్మకు ప్రత్యేకతను చాటుతుంది.బతుకమ్మ తెలంగాణ ఆడబిడ్డల భక్తి, ఐక్యత, సాంస్కృతిక వైభవానికి ప్రతిబింబంగా నిలుస్తోంది.ఈ సందర్భంగా టి.డబ్ల్యూ.జె.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ"పూల పరిమళంలా ప్రతి ఇంటిలో ఆనందం, సౌభాగ్యం వెల్లివిరియాలి. బతుకమ్మ ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యత, సాంస్కృతిక వారసత్వాన్ని మరింత బలపరచాలి" అంటూ రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## యూరియా కుంభకోణంపై బీజేపీ విమర్శలు

### ఎమ్మెల్యే రాజీనామాకు డిమాండ్



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లాలో రూ.200 కోట్ల యూరియా కుంభకోణం జరిగినట్టు ఆరోపిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూరియాను అక్రమంగా దారి మళ్లించిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రెడ్ హ్యాండ్‌గా పట్టుబడ్డారని ఆయన పేర్కొన్నారు.'రైతుల బాగోగుల పేరుతో సీఎం రేవంత్ రెడ్డికి రెండు కోట్లు పంపినట్టు నాటకం చేస్తున్నారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి బత్తుల లక్ష్మారెడ్డిని రాజీనామా చేయించాలి. ఆయన నల్లగొండ రైతులకు క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు.'జానారెడ్డి కుటుంబం గూడ్స్ ట్రైన్ ద్వారా యూరియాను నాగార్జునసాగర్‌కు తరలించింది. కేంద్రం రూ.266కి అందిస్తున్న యూరియాను కొన్నిచోట్ల రూ.500కి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారు. కాంగ్రెస్ పార్టీ కుంభకోణాలకు అడ్డా అవుతోంది" అని విమర్శించారు."మిర్యాలగూడను కమిషన్ హబ్‌గా మార్చి ఎమ్మెల్యేలు, మంత్రులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 11 స్థానాలు గెలిచినా అభివృద్ధి జరగలేదు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు" అని వర్షిత్ రెడ్డి అన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో ముందస్తు బతుకమ్మ ఉత్సవాలు







**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలన భవన కార్యాలయం ముందు శనివారం ముందస్తు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, ఓఎస్‌డీ టు వీసీ డాక్టర్ డి. హరి కాంత్, అధ్యాపకులు, విద్యార్థులు, బోధంతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా "పూలనే దేవతగా పూజించే బతుకమ్మ పండుగ భారతీయ సంస్కృతికి ప్రతీక. ప్రపంచంలో భారతదేశంలో తప్ప ఈ సంప్రదాయం ఎక్కడా కనిపించదు. తొమ్మిది రోజులు పండుగను జరుపుకుంటూ విద్యార్థులు మన సంస్కృతిని చాటాలి" అని వారు పేర్కొన్నారు.

# మధ్యవర్తిత్వం ద్వారా వేగవంతమైన న్యాయ పరిష్కారం

## న్యాయమూర్తి జె. శ్రీనివాసరావు



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మధ్యవర్తిత్వం ద్వారా కేసులు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పరిష్కారమవుతాయి. న్యాయస్థానాలపై భారం తగ్గుతుంది. కక్షిదారులకు నమ్మకం పెరుగుతుంది" అని తెలిపారు. "కేసు పరిష్కారం కాకపోయినా, తిరిగి న్యాయస్థానంలో విచారణకు అవకాశం ఉంటుంది. న్యాయమూర్తులు, న్యాయవాదులు మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలి" అని సూచించారు. కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ మెంబర్ సెక్రటరీ సిహెచ్. పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. శివకుమార్, కార్యదర్శి కె. వెంకటేశ్, జిల్లా న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు. శిక్షణ పొందిన న్యాయవాదులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# బి.సి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా తోట రాజ్ కుమార్ నియామకం



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన తోట రాజ్ కుమార్ పటేల్ను బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నియమించారు. నియామక పత్రాన్ని జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్కు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. "బి.సి.ల సంక్షేమానికి నిబద్ధంగా పనిచేస్తాను" అని తోట రాజ్ కుమార్ పేర్కొన్నారు.

# నాటుసారా స్థావరాలపై దాడులు

## ఇద్దరిపై కేసు నమోదు



**మందమర్రి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మందమర్రి మండలంలోని పులిమడుగు గ్రామంలో నాటుసారా స్థావరాలపై బెల్లంపల్లి ఎక్సైజ్, మంచిర్యాల టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బానోత్ అంబ్రియ, భుఖ్యాదేవి ఇంట్లో నాటుసారా లభ్యమైందని అధికారులు తెలిపారు. ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్, టాస్క్ ఫోర్స్ సీఐ సమ్మయ్య ఆధ్వర్యంలో కేసులు నమోదు చేశారు. దాడుల్లో ఎస్సై శారద, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# రామగుండం అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



**రామగుండం, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శనివారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి, జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పాలకుర్తి, అంతర్గం మండలాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. "విద్య, వైద్యం, రహదారులు, శుద్ధి జలాలు, పారిశుద్ధ్య సదుపాయాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రతి గ్రామం, ప్రతి వార్డు అభివృద్ధే నా లక్ష్యం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రహదారి మరమ్మతులు, కాలువల నిర్మాణం, పార్కులు, వీధి దీపాలు వంటి పనులను వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కూడా "ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయి" అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో ఎంపీ కడియం కావ్య



**హనుమకొండ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడి, శుభాకాంక్షలు తెలిపారు. "బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక ప్రతీక. మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి. విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తును నిర్మించాలి" అని ఎంపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామచంద్రం, ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేరాల తగ్గుదలకు శిక్షలు కీలకం

## సీపీ అంబర్ కిశోర్ ఝా



**మంచిర్యాల, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. శనివారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. "బాధితులకు న్యాయం జరిగేలా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలి. సాక్షులను సమర్థంగా ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరగేలా చూడాలి" అని సూచించారు.

# పుల్లెల పవన్, అజయ్ వర్మకు ఘన సన్మానం



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గన్నేరువరం మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బొడ్డు బాలయ్య ఆధ్వర్యంలో మానేరు వాగుపై వంతెన కోసం రూ.77 కోట్ల నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర బీజేపీ నాయకులు డాక్టర్ పుల్లెల పవన్ కుమార్, సొల్లు అజయ్ వర్మలకు శాలువాలతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, బండి సంజయ్, కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పుల్లెల నందయ్య, గొల్లపల్లి రవి, పుల్లెల మల్లయ్య, కొట్టే భూమయ్య, పుల్లెల మీనయ్య, బోడ మాధవ రెడ్డి, పుల్లెల తిరుపతి, తోట శ్రీధర్, పుల్లెల రాము, పుల్లెల జగన్ మోహన్, శంకర్, గ్రామ ప్రజలు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నవభారత్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



**హుస్నాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక నవభారత్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శనివారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ గంగారవేని రవి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయినిలు కలిసి అతిపెద్ద బతుకమ్మను తయారు చేసి, పలు బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కోలాటం, బతుకమ్మ ఆటలు అందరిని అలరించాయి. "ప్రతి సంవత్సరం ఇలాగే పాఠశాలలో సంబరాలు నిర్వహిస్తాం" అని కరస్పాండెంట్ రవి తెలిపారు.

# పంట నమోదు ప్రక్రియ ప్రారంభించాలి

## సీపీఎం డిమాండ్




**హుస్నాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా పంట నమోదు ప్రక్రియ ప్రారంభించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకులు గుగులోతు శివరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు అమ్మేందుకు సివిల్ సప్లై, మార్క్‌ఫెడ్, సీసీఐ సంస్థలు పంట నమోదు ఆధారంగా మాత్రమే కొనుగోలు చేస్తాయి. గతంలో ఏఈవో, ఏవోల చుట్టూ రైతులు తిరిగిన ఘటనలు ఎన్నో ఉన్నాయి" అని గుర్తు చేశారు. 'గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి, అర్హులైన రైతులందరికీ నమోదు చేయాలి. పంట నమోదు లేకపోవడంతో యూరియా, డిఏపి బస్తాల కోసం రైతులు క్యూ లైన్లలో నిలబడుతున్నారు" అని తెలిపారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగాన్ని చర్యలు చేపట్టేలా చూడాలని డిమాండ్ చేశారు. "లేనిపక్షంలో వ్యవసాయ శాఖ ఏడి కార్యాలయాన్ని ముట్టడిస్తాం" అని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు నాయక్, వినోద్ రావు, నవీన్, హరీష్, శ్రీయాన్స్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



**యాచారం, సెప్టెంబర్ 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** యాచారం మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. నక్కర్త మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఉదయశ్రీ ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. తెలంగాణ జిల్లాల్లోని ప్రతి పట్టణం, పల్లెల్లోజరగనున్న తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు బతుకమ్మ ఉత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ సంబరాల వేడుకల నిర్వహణపై స్థానికులు విద్యార్థులను అభినందించారు . ఈ సందర్భంగా విద్యార్థుల ఆట,పాటలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

## ఆరోగ్య భారత్ నిర్మిద్దాం



**వనపర్తి, సెప్టెంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదినోత్సవం సందర్భంగా సేవా పక్షం-2025 లో భాగంగా వనపర్తి 8వ వార్డులోని మున్సిపల్ పార్క్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో, కో-కన్వీనర్ కడమంచి శివ నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించి, పరిశుభ్రతతో ఆరోగ్య భారత్ నిర్మాణానికి ప్రతి కుటుంబం సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కడమంచి ముత్యాలు ని సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షులు భాషెట్టీ శ్రీనివాసులు, పట్టణ ప్రధాన కార్యదర్శి దంతోజు నవీన్, పట్టణ కోశాధికారి కూన శ్రీకాంత్, వార్డు ఇంచార్జ్ చిన్న రాయుడు, శివ నరేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన చింతల రవికుమార్ గుప్తా



ఎల్బీనగర్ ,
సెప్టెంబర్ 20( నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ రాష్ట్రం మరియు వనస్థలిపురం డివిజన్ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా . పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని ఉద్ఘాటించారు. ఈ మేరకు చింతల రవికుమార్ గుప్తా ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆడపడుచులందరూ కలిసి సంతోషంగా చేసుకోవాలని ఆకాంక్షించారు చింతల రవికుమార్ గుప్తా .తెలంగాణ సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకూ తొమ్మిది రోజుల పాటు ఆట పాటలతో అందరూ వైభవంగా ఈ పండుగను జరుపుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని చింతల రవికుమార్ గుప్తా
గౌరమ్మను ప్రార్థించారు.

## వీధి అమ్మకందారులకు తోపుడు బండ్ల పంపిణీ




**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది వీధి అమ్మకందారులకు తోపుడు బండ్లు, నలుగురు దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ వీధి వ్యాపారులకు చేయూతనివ్వడం అభినందనీయమని, స్వనిధి యోజన ద్వారా అనేకమందికి గుర్తింపు లభించిందని తెలిపారు. కళాభారతి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి




**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన యూనివర్సిటీ ఎదుట మహాత్మా జ్యోతి బా ఫూలే కూడలి సుందరీకరణ పనులను శనివారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పరిశీలించారు. 15 లక్షల సుడా నిధులతో జరుగుతున్న పనుల్లో నాణ్యత పాటించి వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

## ఆర్థిక నేరాలపై సమీక్షించిన కమిషనర్ గౌస్ ఆలం



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఆర్థిక నేరాలపై కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది.
అక్షర చిట్‌ఫండ్, క్రిప్టోకరెన్సీ కేసులతో సహా అన్ని కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయ్ కుమార్, శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బధిరులకు నైపుణ్య శిక్షణ అవసరం: కలెక్టర్ పమేలా




**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇండియన్ సైన్ లాంగ్వేజ్ శిక్షణ కోర్సు పూర్తి చేసిన వారికి శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. బధిర విద్యార్థుల్లో ప్రతిభ ఉందని, ఆర్ట్, క్రాఫ్ట్, బైండింగ్ వంటి రంగాల్లో శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఉన్నతాధికారులకు ఆన్లైన్ తరగతులు ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, కోఆర్డినేటర్ రాంబాబు, ప్రిన్సిపల్ కమల, అక్షయ ఆకృతి ఫౌండేషన్ ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

## సిపిఐ జాతీయ మహాసభలకు బయల్దేరిన కరీంనగర్ ప్రతినిధులు



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చండీఘర్‌లో సెప్టెంబర్ 21 –25 వరకు జరిగే సిపిఐ 25వ జాతీయ మహాసభలకు జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి శనివారం బయలుదేరారు. మహాసభల్లో పార్టీ నిర్మాణం, ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యాచరణపై చర్చ జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు.

## నాగరంలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు




**మేడ్చల్,సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకంగా నిలిచే బతుకమ్మ పండుగ మేడ్చల్ జిల్లా నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా శనివారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడారు . విద్యార్థులు వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ నృత్యాలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ వేడుకలు నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రైతులకు 75 శాతం రాయితీ తో యాంత్రిక పరికరాలు




**జైపూర్,సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో ఇందారం గ్రామ పంచాయతీలో పి ఎం కే స్ వై(ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన పథకం)వాటరషెడ్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఉత్పాదకత పెంపుదల కింద 75 శాతం రాయితీ తో ఇందారం గ్రామ పంచాయతీ కి మొదటి విడత కింద 14 మంది రైతులకు గాను 32 యాంత్రిక పరికరాలు వచ్చినవి.ఈ పరికరాలను ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు ఆధ్వర్యంలో అందచేయడం జరిగింది.

## నవరాత్రి ఉత్సవాలకు మహాశక్తి దేవాలయం ముస్తాబు

### సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు వైభవంగా నవరాత్రోత్సవాలు



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ మహాశక్తి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణం, పరిసర వీధులు విద్యుత్ దీపాలతో, పూల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి.శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వామివారి ఆశీస్సులతో సెప్టెంబర్ 22న ప్రారంభమయ్యే ఉత్సవాలు అక్టోబర్ 2 వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. భవాని దీక్ష కోసం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ప్రతి రోజు ఉదయం మహాహారతి, రాత్రి 7 గంటలకు ప్రవచనం, 9 గంటలకు దాండియా, 10 గంటలకు మహాభిషేకం నిర్వహించనున్నారు. అమ్మవారు ప్రతిరోజూ భిన్న అవతారాలలో, విశిష్ట అలంకరణలతో దర్శనమిస్తారు. 29న సద్దుల బతుకమ్మ, 30న పల్లకి సేవ, అక్టోబర్ 1న మహార్నవమి, 2న విజయదశమి వేడుకలు జరుగనున్నాయి. భవాని దీక్ష స్వీకరించే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివస్తున్నారు.ఉత్సవాల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు. భక్తుల కోరికలు తీర్చే అమ్మవారి కరుణాకటాక్షం పొందేందుకు నవరాత్రి పూజల్లో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

## జాతీయ స్థాయిలో దివ్యదృష్టి విద్యార్థుల సంగీత ప్రతిభకు గుర్తింపు




**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దివ్యదృష్టి విద్యార్థులు అద్భుతంగా పాటలు పాడి జాతీయ స్థాయిలో గ్రేట్ సింగర్లుగా గుర్తింపు పొందారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసిస్తూ, ఐదు లక్షల విలువైన సంగీత వాయిద్యాలు మంజూరు చేశారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ –సాహితీ గౌతమి ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై, "వారి ప్రతిభ కరీంనగర్ గర్వకారణం" అని పేర్కొన్నారు. గ్రానైట్ అసోసియేషన్, ఫిలిం సొసైటీ, పలువురు కళాకారులు, కవులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులకు నగదు, బహుమతులు అందించారు.

## బాలికలకు "స్నేహ" ద్వారా చైతన్యం కల్పించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
15 –18 ఏళ్ల బాలికలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చి, రక్షణ, ఆరోగ్యం, విద్య, ఉపాధి అంశాల్లో అవగాహన కల్పించేందుకు "స్నేహ" కార్యక్రమం ఉపయుక్తమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, బడి బయట ఉన్న బాలికలను గుర్తించి, గ్రూపులుగా ఏర్పాటు చేసి, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మహిళా సంఘాల అనుభవంతో బాలిక సంఘాలను అనుసంధానించాలని, వివిధ శాఖలు ౧ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, మెప్మా, పోలీస్, వైద్య, విద్య౧ కలిసి అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ డీఆర్డీవో రవికుమార్, మెప్మా పీడీ స్వరూపారాణి, సంక్షేమ అధికారి సరస్వతి, పంచాయతీ అధికారి జగదీశ్వర్, వైద్యాధికారి వెంకటరమణ, క్రీడాధికారి శ్రీనివాస్ గౌడ్, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన ఫార్మసీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు




**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. కే శ్రీశైలం, విభాగాధిపతి జి.యల్. అర్చన, డా. బి. భాగ్యలక్ష్మి, డా. సీహెచ్. అనిల్ కుమార్, డా. ఏ. శ్రీనివాస్ నాయక్, డా. పి. క్రాంతి రాజు, జే. అశ్విని, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# అభిమానులను సర్‌ప్రైజ్ చేయాలనుకుంటున్నా..

## క్యూరియాసిటీ పెంచుతున్న తమన్నా కామెంట్స్

తెలుగు, హిందీతోపాటు వివిధ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది తమన్నా భాటియా. బాహుబలి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో స్టార్ డమ్ అందుకున్న ఈ భామ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ పాపులర్ నటీమణుల్లో టాప్‌లో ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. సినిమా సినిమాకు గ్లామర్ డోస్ పెంచుతూ.. కొత్త హీరోయిన్లకు గట్టిపోటీనిస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంది.నెట్టింట సూపర్ క్రేజ్ ఉన్న ఈ ముద్దుగుమ్మ తన బరువుకు సంబంధించి ట్రోల్స్ బారిన పడింది. అయితే ఆ ట్రోల్స్‌కు ఏమాత్రం స్పందించకుండా సైలెన్స్‌ను మెయింటైన్ చేస్తూ వస్తోంది తమన్నా. కానీ తనపై వస్తున్న ట్రోల్స్‌ను మనసులో పెట్టుకొని క్రమం తప్పకుండా వర్కవుట్స్ చేయడమే కాకుండా కఠినమైన ఫిట్‌నెస్ మంత్రను ఫాలో అవుతూ మళ్లీ మునుపటి లుక్‌లోకి మారిపోయింది.ఓ ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ.. తాను మరింత సన్నగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పింది. మరింత నాజూకుగా, స్లిమ్‌గా తయారై రాబోయే సినిమాల్లో అభిమానులను సర్‌ప్రైజ్ చేయాలని ప్లాన్ చేసుకున్నట్టు చెప్పింది. మొత్తానికి మిల్కీ బ్యూటీ మళ్లీ పాత రోజులను గుర్తు తెచ్చేలా సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయబోతుందని తాజా కామెంట్స్ క్లారిటీ ఇచ్చేస్తున్నాయి.తమన్నా చివరగా ప్రైమ్ వీడియో సిరీస్ తో ప్రేక్షకులను పలుకరించింది. తమన్నా ట్రాన్స్‌ఫార్మేషన్ ఇప్పటికే సూపర్ క్రియేట్ చేస్తుండగా.. సిల్వర్ స్క్రీన్‌పై తమన్నా కొత్త లుక్ చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# టాలీవుడ్ కల్ట్ క్లాసిక్.. ‘శివ’ రీ రిలీజ్ ఎప్పుడంటే..!

తెలుగు సినీ చరిత్రలో వచ్చిన కల్ట్ క్లాసిక్ చిత్రాలలో శివ ఒకటి. ఈ సినిమా ఇటీవలే 35 ఏండ్లు పూర్తి చేసుకుంది. నాగార్జున హీరోగా రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం అప్పటివరకు ఉన్న సినిమా జానర్‌లను సమూలంగా మార్చివేసి ఫిల్మ్ మేకింగ్‌లో కొత్త పంథాకు బాటలు వేసింది. అయితే ఈ సూపర్ హిట్ క్లాసిక్‌ను రీ రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ రీ రిలీజ్ తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాను నవంబర్ 14న 4కే వెర్షన్‌లో రీ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించింది.

# అందాలతో గత్తరలేపుతున్న బాలయ్య బ్యూటీ..

## ప్రగ్య ఫోటోలు అదుర్స్

అందం, అభినయం ఉన్న అవకాశాలు లేక ఎదురుచూస్తున్న భామల్లో ఈ ముద్దుగుమ్మ ఒకరు. ఈ చిన్నదాని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన నటనతోనే కాదు గ్లామర్ తోనూ ప్రేక్షకులను ఆకట్టుకొని ప్రేక్షకులను మెప్పించింది ఈ బ్యూటీ. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు అందికుంటున్నా భామ ప్రగ్య.డేగ అనే సినిమాతో ఈ ముద్దుగుమ్మ ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. తమిళం, తెలుగుతో పాటు హిందీలో కూడా తెరంగేట్రం చేసింది ఈ బ్యూటీ. మిర్చి లాంటి కుర్రాడు సినిమాతో తెలుగు సినీరంగంలోకి అడుగుపెట్టింది. తరువాత క్రిష్ దర్శకత్వంలో వచ్చిన కంచె సినిమాలో నటించింది. కంచె సినిమాలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఈ సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసినా కూడా అంతగా పాపులర్ అవ్వలేకపోయింది. సినిమాలతో పాటు చాలా యాడ్స్ లోనూ నటించింది. ఇక ఈ ముద్దుగుమ్మ అఖండ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.సోషల్ మీడియాలో ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసే ఫోటోలకు మంచి క్రేజ్ ఉంది. ఇదిలా ఉంటే మొన్నామధ్య ప్రగ్యా జైస్వాల్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఓ స్టార్ క్రికెటర్ తో డేటింగ్ చేయాలని ఉంది అంటూ చెప్పుకొచ్చింది ఈ ముద్దుగుమ్మ.శుభ్‌మాన్‌తో డేటింగ్ చేయాలనుకుంటున్నట్లు ప్రగ్యా జైస్వాల్ చెప్పుకొచ్చింది. గతంలో సచిన్ టెండూల్కర్ కూతురు సారాతో శుభ్‌మన్ డేటింగ్ చేస్తున్నాడని గతంలో వార్తలు వచ్చాయి. ఈ జంట తరచూ మీడియా కంట పడుతూనే ఉన్నారు. ఇక ఇప్పుడు ప్రగ్యా జైస్వాల్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి.








హాట్ అందాలతో చెలరేగుతున్న నబా నటెష్

# ‘ఇట్లు మీ ఎదవ’ టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసిన బుచ్చిబాబు సానా

దర్శకుడు త్రినాథ్ కఠారి దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ సంజీవని ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘ఇట్లు మీ ఎదవ’. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను ప్రముఖ డైరెక్టర్ బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమా విజయవంతం అవ్వాలని చిత్రబృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సానా మాట్లాడుతూ “ఈ గ్లింప్స్ చూస్తుంటే చాలా ఆసక్తిగా ఫన్నీగా అనిపించింది. చిన్నప్పటి నుంచి జీవితంలో సెటిల్ అయ్యే వరకు ప్రతి అబ్బాయిని ఎవరైనా ఏదో ఒక సందర్భంలో ‘ఎదవ’ అని పిలుస్తూనే ఉంటారు. ఈ టైటిల్ చాలా కొత్తగా, యూత్‌ఫుల్‌గా ఉంది. త్రినాథ్ కఠారి ఈ చిత్రాన్ని చాలా చక్కగా తెరకెక్కించారు. ఈ చిత్రం తప్పకుండా యువ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ‘ఇట్లు మీ ఎదవ’ చిత్ర యూనిట్‌కి నా తరపున ఆల్ ది బెస్ట్” అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బళ్లారి శంకర్, హీరోయిన్ సాహితీ అవాంచ, నటులు తనికెళ్ళ భరణి, గోపరాజు రమణతో పాటు చిత్ర బృందం పాల్గొంది.ఈ చిత్రానికి కథ, దర్శకత్వం, హీరోగా త్రినాథ్ కఠారి వ్యవహరిస్తున్నారు. మన తెలుగు అమ్మాయి సాహితీ అవాంచ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ‘వెయ్యేళ్ళు ధర్మంగా వర్ధిల్లు’ అనేది ఈ చిత్రానికి ట్యాగ్ లైన్. తనికెళ్ల భరణి, గోపరాజు రమణ, దేవీ ప్రసాద్, మధుమణి, సురభి ప్రభావతి, తాగుబోతు రమేష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకులు ఆర్.పి. పట్నాయక్ సంగీతం అందించారు. ఇటీవల నాలుగు అంతర్జాతీయ పురస్కారాలు పొందిన జగదీష్ చీకటి సినిమాటోగ్రాఫర్‌గా, ఉద్ధవ్ ఎస్.బి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.